RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 347 మేడ్చల్ మల్కాజ్‌గిరి 7 జనవరి 2025 మంగళవారం పేజీలు : 4

## కుంభమేళాకు 13 వేల రైళ్లు

ప్రయాగరాజ్ : ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో ఈ నెల 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు జరుగనున్న జరుగనున్న మహా కుంభమేళాకు దేశవిదేశాల నుంచి 40 కోట్ల మంది వరకు వస్తారని అంచనా వేస్తున్నారు. యాత్రికులు, భక్తులను చేరవేసేందుకు రైల్వే శాఖ పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. 50 రోజులపాటు 13 వేల రైళ్లు నడపాలని నిర్ణయించింది. వీటిలో పది వేలు రెగ్యులర్ సర్వీసులు కాగా.. మూడు వేలు ప్రత్యేక రైళ్లు. మేళా జరగడానికి 2–3 రోజుల ముందు.. ఆ తర్వాత 2–3 రోజుల వరకు రైళ్లు నడుస్తాయి. అలాగే పవిత్ర పుణ్యక్షేత్రాలను కలుపుతూ 560 రింగ్ రైళ్లు నడుపనుంది.




# అమ్మో మరో మహమ్మారేనా!?

# చైనా... వైరస్..

# ఇండియాలోకి వచ్చేసింది..!!

జనం భయపడినట్లే జరిగింది.. చైనాలో విజృంభిస్తున్న హ్యూమన్ మెటాప్ న్యూమో వైరస్ (HMPV) ఇండియాలోకి వచ్చేసింది. కర్నాటక రాష్ట్రంలోని బెంగళూరు సిటీలో ఫస్ట్ HMPV వైరస్ గుర్తించారు అక్కడి అధికారులు. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది అదే విధంగా మరో చిన్నారికీ ఈ వైరస్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కర్నాటక రాష్ట్ర ఆరోగ్య శాఖ. బెంగళూరు సిటీలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి నుంచి వచ్చిన రిపోర్టులు పరిశీలించగా.. ఈ వైరస్ విషయం వెలుగులోకి వచ్చినట్లు వెల్లడించారు అధికారులు. HMPV వైరస్ ఎటాక్ అయ్యింది.. ఎనిమిది నెలల చిన్న పాప అని.. ప్రస్తుతం ప్రత్యేక వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు ఇప్పటికే ఈ వైరస్ కేసులు చైనాతో పాటు పలు దేశాల్లో కూడా నివేదించబడ్డాయని, మన దేశంలో కూడా రెండు కేసులను గుర్తించామని తెలిపింది. ఇదే విధంగా అహ్మదాబాద్‌లో మరో చిన్నారికి సైతం తీ వైరస్ సోకినట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు. వైద్యాధికారులు. బెంగళూరు సిటీలోని నార్త్ ఏరియాలోని ఓ ప్రముఖ బాప్టిస్ట్ ఆస్పత్రికి.. HMPV వైరస్ లక్షణాలతో ఉన్న 8 నెలల చిన్నారి వచ్చినట్లు వివరించారు అధికారులు. ఎనిమిది నెలల చిన్నారి.. శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది పడుతుందని తెలిపారు. HMPV వైరస్ ముఖ్యంగా 11 ఏళ్లలోపు చిన్నారులకు త్వరగా వ్యాపిస్తుందని స్పష్టం చేశారు డాక్టర్లు. భారతదేశంలోని ఫస్ట్ HMPV వైరస్ కేసు అని ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం చైనాలోని HMPV వైరస్.. ఇండియాలో నమోదైన HMPV వైరస్ ఒకటేనా లేక వేర్వేరా అనేది తెలియదని కర్నాటక వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది. చైనాలోని వైరస్ డేటా అందుబాటులో లేదని స్పష్టం చేసింది. జనవరి 4వ తేదీ ఎలాంటి కేసులు లేవని ప్రకటించింది కర్నాటక ఆరోగ్య శాఖ.. 6వ తేదీ సోమవారం ఫస్ట్ కేసు నమోదు అయినట్లు ప్రకటించటం విశేషం. ఇండియాలో నమోదైన ఫస్ట్ HMPV వైరస్ కేసుతో కర్నాటక ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. ఈ వైరస్ కు ఎటాక్ అయిన చిన్నారి కుటుంబం నివాసం ఉండే ప్రాంతంలో డాక్టర్ల బృందం పరిశీలిస్తుంది. శానిటేషన్ చేస్తున్నారు అధికారులు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఆ చిన్నారులకు అదే వైరస్ సోకిందని వెల్లడించింది. రొటీన్ సర్వీలియన్స్‌లో వారిద్దరిలో మల్టిపుల్ రెస్పిరేటరీ వైరల్ పాథోజోన్స్‌ను గుర్తించామని వెల్లడించింది. ఆ ఇద్దరు చిన్నారులు ఇప్పటి వరకు ఎలాంటి అంతర్జాతీయ ప్రయాణాలు చేయలేదని, వారికి ఆ వైరస్ సోకడం అనేది గమనార్హం అని వెల్లడిం చింది. వారిద్దరూ ప్రస్తుతం బాప్టిస్టు ఆసుపత్రిలో పొందుతున్నారని, వారికి ఎలాంటి ప్రమాదం లేదని తెలిపింది. ప్రస్తుత డేటా ప్రకారం మన దేశంలో ఈ HMPV వైరస్ కేసుల పెరుగుదల విస్తృతంగా లేదని, ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపింది. ఈ రెండు కేసులను తాము నిశితంగా పరిశీలిస్తున్నామని కర్ణాటక ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా వెల్లడించింది. కేసులు పెరగకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో వెళ్ళినప్పుడు కచ్చితంగా మాస్కులు ధరించాలి. ప్రతి 20 సెకండ్లకు ఒకసారి చేతులను శుభ్రం చేసుకోవాలి. దగ్గు, జలుబు వంటి లక్షణాలు ఉంటే తుమ్మేటప్పుడు, దగ్గేటప్పుడు గుడ్డ అడ్డం పెట్టుకొని తుమ్మాలి. అలాగే వైరస్ సోకినట్లు నిర్ధారణ అయితే బయటికి రావొద్దు. ఇంట్లోనే ఉండి ఇతరులకు అంటకుండా చూసుకోవాలి.

**లక్షణాలు ఎలా ఉంటాయంటే...** ఈ వ్యాధి సోకిన వారికి కరోనా లక్షణాలే ఎక్కువగా ఉంటాయి. దగ్గు, జలుబు, జ్వరం వంటి సమస్యలు వస్తాయి. గొంతునొప్పి వంటి సమస్యలు కూడా ఎక్కువగా ఇబ్బందులకు గురి చేస్తుంది. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉంటే.. బ్రాంకైటిస్, నిమోనియాకు దారి తీసే అవకాశం ఉంటుంది.

ఇన్ఫెక్షన్ సోకిం 3 నుంచి ఆరు రోజుల లోగా ఈ వైరస్ లక్షణాలు బయటపడతాయి. చిన్నారులకు, వృద్ధులకు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వ్యక్తులకు ఈ వైరస్ ఎక్కువగా సోకుతుంది.



## తెలంగాణలో ఓటర్లు 3.35 కోట్లు..

### జాబితా విడుదల చేసిన ఎన్నికల సంఘం

హైదరాబాద్: సవరించిన ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. జాబితా ప్రకారం.. రాష్ట్రంలో మొత్తంగా 3,35,27,925 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 1,66,41,489 మంది పురుషులు, 1,68,67,735 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 2,829 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. 18 నుంచి 19 సంవత్సరాల వయసున్న ఓటర్లు – 5,45,026, 85 సంవత్సరాలు దాటిన సీనియర్ ఓటర్లు – 2,22,091, ఎన్ఆర్ఐ ఓటర్లు – 3,591. ప్రత్యేక ప్రతిభావంతులు ఓటర్లు – 5,26,993, శేరిలింగంపల్లిలో అత్యధికంగా 7,65,982 మంది, అత్యల్పంగా భద్రాచలంలో 1,54,134 ఓటర్లు ఉన్నారు.

## బెంగళూరులో హెచ్ఎంపివి వైరస్ కేసు.. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు కీలక ఆదేశాలు!




చైనాలో వేగంగా విస్తరిస్తున్న HMPV వైరస్ మన దేశంలో ప్రవేశించిందని వార్తలు వస్తున్నాయి. బెంగళూరులో 8 ఏళ్ల ఓ చిన్నారికి ఈ HMPV వైరస్ సోకినట్లు పలు జాతీయ మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. దీంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి.

ఈ వైరస్ ఎక్కడ మరో మహమ్మారిగా మారుతుందోనని కంగారు పడుతున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాలు పలు మార్గదర్శకాలు జారీ చేశాయి. ఏ విధమైన జాగ్రత్తలు పాటించాలి? అనే సూచనలు చేశాయి. ఆ వివరాలను మనం ఈ స్టోరీలో చూద్దాం.

**తెలంగాణ ప్రభుత్వం :** చైనాలో వేగంగా విస్తరిస్తున్న HMPV వైరస్‌ను తాము నిశితంగా పరిశీలిస్తున్నామని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటి వరకు తెలంగాణలో హ్యూమన్ మెటాప్‌న్యూమో వైరస్ కేసులు నమోదు కాలేదని తెలంగాణ ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ బీ.రవీందర్ నాయక్ ఓ ప్రకటనలో వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య శాఖతో తాము సమన్వయంతో పని చేస్తున్నామని HMPV వైరస్ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ప్రజలందరూ తప్పక కొన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మాస్కులు ధరించాలని చేతులను అప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని కోరారు. ఇతరులకు షాక్ హ్యాండ్ ఇవ్వడం కూడా మానేయాలని సూచించింది. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు కచ్చితంగా క్లాత్ ముఖానికి అడ్డం పెట్టుకోవాలని, ఈ వైరస్ ఇతరులకు సోకకుండా ఎవరికి వారు తమవంతు జాగ్రత్తలు పాటించాలని కోరింది.

**ఏపీ ప్రభుత్వం ఏమందంటే? :** చైనాలో వేగంగా HMPV వ్యాపిస్తుండడంతో పాటు బెంగళూరులో దీనికి సంబంధించిన కేసు నమోదైనట్లు వార్తలు వస్తుండడంపై ఏపీ ప్రభుత్వం కూడా స్పందించింది. రాష్ట్ర ప్రజలకు కొన్ని జాగ్రత్తలు సూచించింది. తాము ఈ వైరస్ వ్యాప్తిని నిశితంగా పరిశీలిస్తున్నామని, రాష్ట్ర ప్రజలు దీనిపై ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని తెలిపింది.

ప్రస్తుతం రాష్ట్రంలో హ్యూమన్ మెటాప్‌న్యూమో వైరస్‌కు సంబంధించిన కేసులేమీ నమోదు కాలేదని, ప్రస్తుతం అంత ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వెల్లడించింది. సులభమైన జాగ్రత్తలు పాటించడం వల్ల ఈ వైరస్ బారిన పడకుండా ఉంటామని, ప్రతి ఒక్కరూ ఆ జాగ్రత్తలను పాటించాలని కోరింది. ఎప్పటికప్పుడు తాము చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని, ప్రజలు నిశ్చింతంగా ఉండాలని కోరింది. అటు మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాలు కూడా ఈ వైరస్ కేసులపై స్పందించాయి. తమ తమ రాష్ట్రాల్లో ఎలాంటి కేసులు నమోదు కాలేదని వెల్లడించాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తద్వారా వ్యాధిని నివారించొచ్చని వెల్లడించాయి.




హైదరాబాద్: తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ కేసులో ఇప్పటికే పలువురు అధికారులను ఏసీబీ విచారించిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావుకు ఏసీబీ అధికారులు ఇవాళ(సోమవారం) విచారణకు రావాలని నోటీసులు ఇచ్చారు. ఏసీబీ ఆఫీసుకు కేటీఆర్ వెళ్తూ.. తన న్యాయవాదులను కూడా తీసుకెళ్లారు. అయితే ఏసీబీ అధికారులు న్యాయవాదులను అనుమతిచ్చామని స్పష్టం చేశారు. దీనిపై కేటీఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. విచారణకు రాకుండా కేటీఆర్ ఓ లేఖను అధికారులకు పంపించారు. కేటీఆర్ విచారణకు రాకపోవడంతో ఏసీబీ అధికారులు ఒకింత అసహనం వ్యక్తం చేశారు. అయితే ఈరోజు మరోసారి కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వనున్నారని సమాచారం. ఈ కేసులో కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు నోటీసులు ఇచ్చి ఈరోజు విచారణకు పిలిచారు. అయితే నేడు విచారణకు కేటీఆర్ రావకపోవడంతో మరోసారి నోటీసులు ఇవ్వాలని అధికారులు నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఈరోజు సాయంత్రం ఏసీబీ అధికారులు నోటీసులు జారీ చేయనున్నారని సమాచారం. న్యాయవాది సమక్షంలో విచారణ కోసం న్యాయస్థానాన్ని కేటీఆర్ ఆశ్రయించునున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కేటీఆర్ క్వాష్ పిటిషన్ తీర్పును రిజర్వ్‌లో న్యాయస్థానం ఉంచింది. రేపు విచారణకు హాజరు కావాలని కేటీఆర్‌కు ఈడీ నోటీసులు ఇచ్చింది. అయితే ఈడీ విచారణకు సమయం కోరే యోచనలో కేటీఆర్ ఉన్నట్లు తెలుస్తోంది.




హైదరాబాద్: ఆరాంఘర్– జూపార్కు పైవంతెనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. నగరం నుంచి బెంగళూరు హైవేకు ఉన్న ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు జూపార్కు నుంచి ఆరాంఘర్ వరకు 4.08 కిలోమీటర్ల పొడవునా దాదాపు రూ.800 కోట్లతో ఈ పైవంతెనను బల్దియా నిర్మించింది. గతేడాది డిసెంబరులో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేసినా కొన్ని కారణాల వల్ల నిలిచిపోయింది.

దీంతో కొన్ని రోజుల క్రితం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఫ్లైఓవర్ ప్రారంభానికి ముందుకొచ్చింది. హైదరాబాద్‌లో రోజురోజుకూ ట్రాఫిక్ రద్దీ పెరుగుతోంది. గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో వాహనదారులు తీవ్రఇబ్బంది పడటమే కాకుండా కోట్లాది రూపాయల ఇంధనం, విలువైన సమయం వృథా అవుతోంది. నగరంలోని ముఖ్యప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు జీహెచ్ఎంసీ వ్యూహాత్మకరహదారుల అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా పైవంతెనలు, ఆర్వోబీలను నిర్మిస్తూ ట్రాఫిక్ ఇక్కట్లను దూరంచేస్తోంది. ఎస్ఆర్‌డీపీలోలో భాగంగా సుమారు రూ.800 కోట్లతో చేపట్టిన జూపార్క్– ఆరాంఘర్ పైవంతెన పీవీ ఎక్స్‌ప్రెస్ ఫ్లైఓవర్ తర్వాత నగరంలో రెండో అతిపెద్ద వంతెన.

# సంపాదకీయం

## ఎక్స్ లో ఢిల్లీ రణరంగం

### ఆధునిక టెక్నాలజీతో ఎన్నికల యుద్ధం

ఢిల్లీ ఎన్నికలకు టైం దగ్గరపడుతోంది. ఎన్నికల సంఘం నుంచి ప్రకటన రావడమే ఆలస్యం. నేడో రేపో షెడ్యూల్ వస్తుందని పార్టీలు అంచనా వేస్తున్నాయి. ఇదే సమయంలో తమ ఎన్నికల యుద్ధాన్ని ముమ్మరం చేశాయి. ప్రధాన పార్టీలైన ఆప్, బీజేపీ, కాంగ్రెస్ ఎన్నికల వ్యూహాలను దూకుడుగా రూపొందిస్తున్నాయి. అయితే గత ఎన్నికలకు భిన్నంగా ఈ సారి మూడు పార్టీలు ఆధునిక టెక్నాలజీని వాడుకుని ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ విషయంలో ఆప్, బీజేపీ మధ్య పోటాపోటీ యుద్ధం జరుగుతోంది. ఇరుపార్టీలు సోషల్ మీడియా యుద్ధానికి 'ఎక్స్' వేదిక అవుతోంది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపించిన వేళ.. రాజకీయం ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా ఈ సారి అన్నిపార్టీలు సోషల్ మీడియాను వేదికగా చేసుకుని రణరంగానికి సిద్ధమవుతున్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం ఎన్నికల ప్రచారానికి ఎక్కువగా సోషల్ ప్లాట్ ఫాంలనే పార్టీలు వాడుకుంటున్నాయి. దీంతో ఆన్ లైన్ వేదికగా రణరంగం నడుస్తున్నట్లు కనిపిస్తోంది. పోటాపోటీ వీడియోలు, ఏమోజీలతో ప్రత్యర్థులపై విమర్శలు దాడి చేయడంలో ప్రధాన పార్టీలు పోటీపడుతున్నాయి. వచ్చే నెలలో ఢిల్లీ అసెంబ్లీ గడువు పూర్తవుతోంది. దీంతో ఏ క్షణమైనా ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉందంటున్నారు. దీంతో ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపికపై ఫోకస్ పెట్టాయి. ఈ విషయంలో ఢిల్లీలో అధికార పార్టీ ఆప్ ఓ అడుగు ముందునే ఉంది. ఇప్పటికే 70 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన ఆ పార్టీ సారథి అరవింద్ కేజ్రీవాల్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. మరోవైపు బీజేపీ కూడా 29 మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల చేసింది. ఇంకోపక్క ప్రధాని మోదీతో బహిరంగ సభ నిర్వహించి ఎన్నికల శంఖారావం పూరించింది. ఇక కాంగ్రెస్ కూడా అభ్యర్థుల ఎంపికలో తలమునకలైంది. అయితే ఈ సారి ఎన్నికల్లో మూడు పార్టీలు ఆధునిక టెక్నాలజీపై ఎక్కువగా ఆధారపడినట్లు కనిపిస్తోంది. ఢిల్లీ మహానగరంలో ప్రతి ఓటరునూ చేరుకోవడం భౌతికంగా సాధ్యమయ్యే పని కానందున, ఆన్ లైన్ ద్వారా పార్టీలు తమ ప్రచారాన్ని ఉధ్రుతం చేస్తున్నాయి. ముఖ్యంగా ఆర్టిఫిషీయల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా వీడియోలు తయారు చేయించి ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ఈ వీడియోలు ఓటర్లను అమితంగా ఆకట్టుకుంటుండటంతో అన్ని పార్టీలు ఇదే పంథాను ఎంచుకున్నాయి. ఈ ఆన్ లైన్ ప్రచారంలో ఆప్, బీజేపీ దూసుకుపోతున్నాయి. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత కేజ్రీవాల్ గతంలో ప్రకటించిన GOAT (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్), సన్ ఆఫ్ ఢిల్లీ వంటి నినాదాలకు ఏఐ వీడియోలు జోడించి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రచారాన్ని అడ్డుకోడానికి బీజేపీ కూడా ఏఐ వీడియోలను తయారు చేయించి 'అరవింద్ కేజ్రీవాల్ మోసగాడు' అంటూ ప్రచారం చేస్తోంది. బీజేపీ తన ప్రచారానికి తగ్గట్టు కొన్ని సినిమా సన్నివేశాలను వాడుకుంటోంది. బిగ్ బి అమితాబ్ సినిమా 'బాగ్ బాన్'లో ఎంతో చెమటోడ్చి తమను పెంచిన తల్లిదండ్రులను పిల్లలు పట్టించుకోని సన్నివేశాన్ని వాడుకుంటున్న బీజేపీ.. ఆ సినిమాలోని పాత్రలకు కేజ్రీవాల్ ఫొటో జోడించి ఇలాంటి వారే సన్ ఆఫ్ ఢిల్లీ అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధిస్తోంది. ఏరు దాటాక తెప్ప తగలేసే రకాలంటూ ఆప్ అధినేత కేజ్రీవాల్, ముఖ్యమంత్రి ఆతిశీలను 'ఎక్స్' వేదికగా విమర్శిస్తోంది బీజేపీ. ఈ ఆరోపణలు ప్రత్యారోపణలు వీడియోలతో 'ఎక్స్'లో ట్వీట్ వార్ జరుగుతోంది. తమ ప్రభుత్వంలో చేపట్టిన పనులను వివరిస్తూ ఆప్ వీడియోలు పెడుతుంటే, వాటిని విమర్శిస్తూ బీజేపీ వీడియోలను విడుదల చేస్తోంది. మరోవైపు ఇండి కూటమిలోని భాగస్వామి అయిన కాంగ్రెస్ పైనా ఆప్ వదలడం లేదు.

ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీకి ఏం మిగల్లేదు. గత ఎన్నికల్లో ఒక్క సీటు గెలుచుకోని కాంగ్రెస్ పార్టీకి మళ్లీ అలాంటి ఫలితాలే వస్తాయంటూ విమర్శలు గుప్పిస్తోంది ఆప్. మొత్తానికి అధికారాన్ని నిలబెట్టుకోడానికి ఆప్, ఆ పార్టీని గద్దెదించి కాషాయ జెండా ఎగురవేయడానికి బీజేపీ, ఉనికి చాటుకోవాలని కాంగ్రెస్ ఢిల్లీలో విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి.

## చురుగ్గా పనులు... అందుబాటులోకి అత్యవసర చికిత్సలు



గోదావరిఖని : ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారితో పాటు అత్యంత క్లిష్టపరిస్థితులను ఎదుర్కొంటున్న వారికి అత్యాధునిక, అత్యవసర వైద్య సేవలందించి ప్రాణాలను కాపాడేందుకు గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి ఆవరణలో క్రిటికల్‌కేర్ భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. టి.జి.ఎం.ఐ.డి.సి.(తెలంగాణ ఆరోగ్య మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి సంస్థ) ఆధ్వర్యంలో రూ.23.75 కోట్ల వ్యయంతో 50 పడకల సామర్థ్యంతో 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు అంతస్తుల్లో భవన నిర్మాణ పనులను ఆరు నెలల క్రితం చేపట్టగా ప్రస్తుతం వేగవంతంగా సాగుతున్నాయి. జాతీయ రహదా రుల వెంట ప్రతి 35 కిలోమీటర్ల దూరంలో ఒక ట్రామాకేర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఇటీవల వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ప్రకటించగా గోదావరిఖనిలో క్రిటికల్ కేర్ భవనంలో ట్రామాకేర్‌తో పాటు వివిధ విభాగాల్లో అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశముంది. ఇందుకోసం ఆసుపత్రి ఆవరణలోని అటెండెంట్ల షెడ్డు, కిచెన్ షెడ్డుతో పాటు నీటి ట్యాంకును కూల్చి వేశారు. పక్కనే ఉన్న నవజాత శిశు సంరక్షణ కేంద్రాన్ని ఆనుకొని నిర్మాణ పనులను చేపడుతున్నారు. గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో క్రిటికల్‌కేర్ సదుపాయాల కోసం టి.జి.ఎం.ఐ.డి..సి. రూ.23.75 కోట్ల నిధులను కేటాయించగా అందులో రూ.10 కోట్లతో నిర్మాణ పనులు చేపడుతున్నారు. మిగతా రూ.13.75 కోట్లతో వివిధ విభాగాల్లో అవసరమైన వైద్య సామగ్రిని సమకూర్చనున్నారు.

తగ్గనున్న దూరాభారం...

రాజీవ్ రహదారిలో నిత్యం అనేక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సాధారణ గాయాలకు గోదావరిఖని సార్వజనిక ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన వారికి ప్రాథమిక చికిత్స చేసి కరీంనగర్, హైదరాబాద్‌కు తరలించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితి విషమంగా మారడంతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలున్నాయి. స్థానికంగానే క్రిటికల్ కేర్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తే ప్రమాదబాధితులకు దూర, ఆర్థిక భారం తగ్గడంతో పాటు ప్రాణహాని తప్పే అవకాశముంది. ఇటీవలి కాలంలో రామగుండం ప్రాంతంలో పలువురు గుండెపోటుకు గురైన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆసుపత్రి ఆవరణలో గుండె వ్యాధుల శస్త్ర చికిత్స కోసం ప్రత్యేకంగా క్యాథ్‌లాబ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. దీని కోసం ఆసుపత్రి అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించారు. స్థానిక పరిశ్రమలు సహకరిస్తే 'ఖని'లో క్యాథ్‌లాబ్ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశముంది.

మెరుగైన వైద్యం అందనుంది

గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ భవన నిర్మాణం పూర్తయితే అన్ని విభాగాల్లో అత్యవసరమైన అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఎంతటి క్లిష్టమైన పరిస్థితుల్లోనైనా తక్షణమే వైద్య సేవలందించే సదుపాయం అందుబాటులోకి వస్తుంది. ఆయా పనులు పూర్తయితే మెరుగైన వైద్యానికి రామగుండం కేంద్రం కానుంది. హైదరాబాద్ తరహా వైద్య సేవలు దశలవారిగా రామగుండంలోనే అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. డాక్టర్ హిమబిందుసింగ్, ప్రిన్సిపల్, ప్రభుత్వ వైద్య కళాశాల, గోదావరిఖని

## కొన్నారు.. మూలన పెట్టారు




జగిత్యాల : ఇక్కడ కనిపిస్తున్న 4 కొత్త ఆటోలను రూ.25 లక్షల వ్యయం చేసి బల్దియా 2 నెలల కిందట కొనుగోలు చేసింది. ఈ వాహనాలకు రిజిస్ట్రేషన్ పూర్తయినా 2 నెలలుగా విద్యానగర్ నీళ్లట్యాంకు వద్దే ఉంచారు. పట్టణంలో ఓవైపు చెత్త సేకరణ లేక కాలనీలు కంపు కొడుతుంటే కొనుగోలు చేసిన వాహనాలను పక్కనపెట్టడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

స్థానిక 45వ వార్డులో పారిశుద్ధ్య సిబ్బంది వారం రోజులుగా చెత్త తొలగించలేదు. దసరా పండగపూట కాలనీవాసులు దుర్గంధంతో విసిగిపోయారు. కారణమేంటని కాలనీవాసులు ఆరా తీస్తే ఈ వార్డుకు చెందిన వాహనం 2 నెలలుగా మరమ్మతులో ఉందని పురపాలక సిబ్బంది తెలిపారు. కొత్త వాహనాలు కొనుగోలు చేసినా వార్డులకు కేటాయించకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు.

ఈ చిత్రంలో ముసుగుకప్పి కనిపిస్తుంది కొత్త ట్రాక్టరు. చెత్త సేకరణ కోసం రూ.14 లక్షలు వెచ్చించి బల్దియా ఏడాది కిందట దీన్ని కొనుగోలు చేసింది. షోరూం నుంచి తెచ్చి విద్యానగర్ నీళ్లట్యాంకు వద్ద చెట్టుకింద ఇలా నిలిపారు. పురపాలిక అధికారుల నిర్లక్ష్యంతో సంవత్సరం నుంచి వినియోగానికి దూరమై తుప్పుపడుతోంది. జగిత్యాల పట్టణంలో 48 వార్డుల నుంచి నిత్యం 70 మెట్రిక్ టన్నుల చెత్త సేకరిస్తున్నారు. వార్డుల విలీనం తరువాత గృహాల సంఖ్య పెరగటం, కాలనీలను విస్తరించడంతో చెత్త సేకరణ బల్దియాకు సవాలుగా మారింది. వాహనాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఆటోలు, ట్రాక్టర్లు తరచూ మరమ్మతుకు గురవుతున్నాయి. దీంతో బల్దియా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.14 లక్షలతో ఏడాది క్రితం ట్రాక్టరును.. రెండు నెలల కింద రూ.25 లక్షలతో 4 కొత్త ఆటోలను కొనుగోలు చేశారు. వీటిని వెంటనే ప్రారంభించి వినియోగించాల్సిన అవసరం ఉన్నా.. నిర్లక్ష్యంతో పక్కన పెట్టేశారు.

మరమ్మతులపైనే శ్రద్ధ

పురపాలిక అధికారులకు మరమ్మతులపై ఉన్న శ్రద్ధ వాహనాల నిర్వహణపై లేకుండా పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏడాదికి రూ.20 లక్షల చొప్పున మరమ్మతులకు వ్యయం చేస్తున్నారు. కొత్త వాహనాలు కొనుగోలు చేయాలనే డిమాండ్ రెండేళ్లుగా ఉన్నా అధికారులు నిర్లక్ష్యం వహించారు. వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ కొరవడటం.. సభ్యుల నుంచి ఒత్తిళ్లు పెరగడంతో కొత్త వాహనాలు కొనుగోలు చేసినా మరమ్మతుల యావలోపడి వీటి నిర్వహణ మరిచారు. ప్రస్తుతం 15 ఆటోలు మరమ్మతు కోసం నెలల తరబడి మెకానిక్ షెడ్లలో మగ్గుతున్నాయి. తరచూ కమిషనర్లు మారటం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు సిబ్బంది మరమ్మతుల పేరిట ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ఎక్కడి చెత్త అక్కడే..వాహనాలు పాడైపోయాయని.. కొత్త వాహనాలు లేవనే కారణాలతో పారిశుద్ధ్య సిబ్బంది వార్డుల్లో చెత్త సేకరణను సక్రమంగా నిర్వహించడం లేదు. మొరాయిస్తున్న వాహనాలతోనే సామర్థ్యానికి మించి చెత్త సేకరిస్తున్నామని కొందరు పారిశుద్ధ్య సిబ్బంది వాపోతున్నారు. వార్డుల్లో కనీసం వారం రోజులకోసారి కూడా చెత్త సేకరణ చేపట్టకపోవడంతో పలు కాలనీల్లో దుర్గంధం వ్యాపిస్తోంది. తీవ్రమైన జ్వరాల బారిన ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నా అధికారులు కనీసం దోమల నివారణ మందు కూడా చల్లడం లేదు. సమస్యల పరిష్కారానికి పురపాలిక సభ్యులు స్పందించాలని ఆయా వార్డుల ప్రజలు కోరుతున్నారు.

## రివ్యూ ఓపీ మరింత వేగంగా

ధర్మపురి: నిత్యం వేలాది మంది వైద్య సేవలకు పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రికి వస్తారు. రోజుల వ్యవధిలో మళ్లీ వచ్చే వారు సైతం ఓపీ చీటీ తీసుకోవాలంటే గంటలు నిరీక్షించాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో రివ్యూ ఓపీకి నిరీక్షణ లేకుండా రెండే నిమిషాల్లో చీటీ అందించేలా కియోస్క్ యంత్రాలను అందుబాటులోకి తెచ్చారు. పైలెట్ ప్రాజెక్టుగా మిలీనియం బ్లాక్‌లో ఏర్పాటుచేశారు. ఓ ఐటీ సంస్థ సహకారంతో వీటిని ఏర్పాటుచేశామని, పనితీరు బాగుంటే అన్నీ విభాగాల్లో ఏర్పాటు చేస్తామని ఆస్పత్రి డైరెక్టర్ నగరి బీరప్ప తెలిపారు. ఎలా పనిచేస్తాయంటే..?ఆస్పత్రిలో 31విభాగాల్లో ఓపీ సేవలు ఉంటాయి. నిత్యం 3500మంది దాకా వస్తుంటారు. అరవై శాతం రోగులు కొద్ది రోజుల్లోనే రెండుమూడు సార్లు రావాల్సి ఉంటుంది. వచ్చిన ప్రతీసారి క్యూలో ఉండే పనిలేకుండా ఈ యంత్రంతో తీసుకోవచ్చు. మిలీనియం బ్లాక్‌లో న్యూరాలజీ, న్యూరోసర్జరీ, రుమటాలజీ, సైకియాట్రిక్ ఓపీ సేవలందిస్తారు. ఉదాహరణకు ఓ రోగి న్యూరోసర్జరీ విభాగానికి వచ్చి ఓపీ తీసుకున్నారు. వైద్యున్ని కలిస్తే కొన్ని పరీక్షలు సూచిస్తారు. రిపోర్టులు మరుసటిరోజు వస్తాయి. మరోసారి వైద్యున్ని కలవాల్సిఉంటుంది. అప్పుడు కౌంటర్ల వద్దకాకుండా కియోస్క్ వద్దకు వెళ్లి సీఆర్ నంబరు నమోదుచేస్తే వివరాలు చూపిస్తాయి. ఓపీచీటీ వస్తుంది. దాంతో వైద్యుడి వద్దకు వెళ్లవచ్చు. రూ.100వెచ్చించి తీసుకునే ఓపీకి 14 రోజుల గడువుంటుంది. గడువు ముగిసేవరకు ఎన్నిసార్లయినా ఈ యంత్రం సాయంతో తీసుకోవచ్చు.

## తనిఖీలు సరే.. రికవరీ ఏదీ!

పెద్దపల్లి : ఉన్న ఊరిలో పని కల్పించేందుకు అమలు చేస్తున్న ఉపాధిహామీ పథకం అక్రమాలతో అభాసుపాలవుతోంది. పర్యవేక్షణ కరవై రూ.లక్షలు పక్కదారి పడుతున్నాయి. మండుటెండలో కష్టించిన కూలీ శ్రమ దోపిడీకి గురవుతోంది. వలసలకు అడ్డుకట్ట వేయడం మాట ఎలాగున్నా అక్రమార్కులతో కుమ్మక్కైన అధికారులు నిధులు స్వాహా చేస్తున్నారు. తనిఖీలపై చూపుతున్న శ్రద్ధ నిధుల రికవరీపై లేకపోవడంతో అక్రమాలు పరిపాటిగా మారాయి.

అవకతవకలతో శ్రమ దోపిడీ

పనికి వెళ్లని కూలీల పేరిట నిధులు పక్కదారి పడుతున్నాయి. కొలతల నమోదులో అవకతవకలతో కూలీల శ్రమలో కోత పడుతోంది. కొంతమంది పని చేయకున్నా రికార్డు చేసి వేతనాలు చెల్లిస్తున్నారు. నేల స్వభావం గట్టిగా ఉండటంతో వేతనం గిట్టుబాటు కావడం లేదు. బోగస్ జాబ్‌కార్డులు సృష్టించి ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారు. కంప్యూటరులో నమోదు చేసే క్రమంలో జరిగే తప్పులతో వేతనాల్లో హెచ్చుతగ్గులు వస్తున్నాయి.

వేటు పడుతున్నా మారని తీరు

ఉపాధిహామీలో పక్కదారి పట్టిన నిధులను రాబడం అధికారులకు



తలకు మించిన భారంగా మారింది. అవినీతి, అవకతవకలకు పాల్పడుతున్న సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేస్తున్నా అక్రమాలు తగ్గడం లేదు. గడిచిన తొమ్మిదేళ్లకు సంబంధించి గణాంకాలు విస్తుపోయేలా చేస్తున్నాయి. జిల్లాలో రూ.83.64 లక్షలు పక్కదారి పట్టగా ఇప్పటివరకు రూ.76.12 లక్షలు మాత్రమే రికవరీ అయ్యాయి. నిబంధనలు కఠినంగా అమలు చేయకపోవడంతో అక్రమార్కులు తిరిగి చెల్లించేందుకు వెనుకాడుతున్నారు.

పని చేయకున్నా వేతనాలు

జిల్లాలో గత కొన్ని సామాజిక తనిఖీ నివేదికలు పరిశీలిస్తే రామగిరి మండలంలో రూ.1,01,073, కమాన్‌పూర్‌లో రూ.19,722, అంతర్గాంలో రూ.67,082, ముత్తారంలో రూ.43,703, పాలకుర్తిలో రూ.58,476, ఎలిగేడులో రూ.20,202, ధర్మారంలో రూ.1,08,941, జూలపల్లిలో రూ.10,266, కాల్వశ్రీరాంపూర్‌లో రూ.25,351, సుల్తానాబాద్‌లో రూ.33,630, పెద్దపల్లిలో రూ.59,412 చొప్పున నిధులు దుర్వినియోగమయ్యాయి. కాల్వశ్రీరాంపూర్ మండలం జాఫర్‌ఖాన్‌పేటలో హాజరు నమోదులో తప్పులతో కూలీలు నష్టపోయారు. పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్‌లో పనికి చేయకున్నా కొందరు వేతనాలు పొందారని ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

పర్యవేక్షణ పెంచుతున్నాం

ఉపాధిహామీ పనులపై పర్యవేక్షణ పెంచుతున్నాం. కూలీల వివరాల నమోదులో పొరపాట్లను సరి చేస్తున్నాం. బోగస్ హాజరు వ్యవహారంపై పర్యవేక్షిస్తున్నాం. తనిఖీల్లో వెలుగుతు చూసిన అవకతవకలకు సంబంధించి నిధుల రికవరీకి చర్యలు తీసుకుంటున్నాం. రవీందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

## అమృత్ పథకం.. ఆమడదూరం!

జహీరాబాద్: ఇంటింటికి తాగునీటిని అందించాలని గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. జహీరాబాద్ పట్టణంలో ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. ఈ పరిస్థితిని చక్కదిద్ది, మొత్తం పట్టణానికి నీటిని అందించాలని రూ.66 కోట్లతో రెండేళ్ల కిందట ప్రతిపాదించిన అమృత్ పథకం కార్యరూపం దాల్చలేదు.

తప్పని ఎదురు చూపులు: జహీరాబాద్ పురపాలికలో 1.20 లక్షల జనాభా, 37వార్డులు, 14వేలకు పైగా గృహాలున్నాయి. రోజుకు 1.60 కోట్ల లీటర్ల నీరు అవసరం ఉండగా, ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా 80 లక్షల లీటర్లు, బోర్ల ద్వారా మరో 20 లక్షల లీటర్ల నీరు సరఫరా చేస్తున్నారు. పట్టణంలో నాలుగేళ్ల కిందట మిషన్ భగీరథ పథకం చేపట్టినా, ఇంకా 20శాతం వార్డుల్లో పైపులు వేయలేదు. మరో 20శాతం ప్రాంతాల్లో పైపులైను వేసినా నీటిని సరఫరా చేయడంలేదు. అమృత్ పథకం ద్వారా మరో 70 లక్షల లీటర్ల నీటిని అందించి, భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా చేయాలని ప్రతిపాదించినా,



ప్రారంభానికి నోచలేదు.

పునరుద్ధరణకు నోచని పథకం: పట్టణానికి 20ఏళ్లుగా రాయికోడ్ మండలం ఇటికేపల్లి శివారు మంజీరా నది నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు. దాదాపు 44కిలోమీటర్ల దూరం ఉండడంతో బోర్లు తరుచుగా కాలిపోవడం, పైపులైన్లు పగిలిపోయి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఐదేళ్ల కిందట రెండేళ్ల పాటు ఏర్పడిన వర్షాభావంతో నది పూర్తిగా ఎండిపోవడంతో పథకాన్ని పూర్తిగా నిలిపివేశారు. అంతలోనే మిషన్ భగీరథ రావడంతో నిరుపయోగంగా మారింది. అమృత్ పథకం నిధుల ద్వారా పునరుద్ధరించాలని నిర్ణయించినా కార్యరూపం దాల్చలేదు. అధికారులతో సమీక్ష నిర్వహిస్తాం.. ఈ పథకంపై పూర్తి అవగాహన లేదు. త్వరలోనే మిషన్‌భగీరథ, ప్రజారోగ్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి పరిస్థితిని తెలుసుకుని ఉన్నతాధికారుల సూచనల మేరకు పనులు వేగంగా సాగేలా చూస్తాం. శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ పురపాలక సంఘం.

# బొగ్గు ధర ప్రియం.. ఇతర కంపెనీలే నయం

గోదావరిఖని: బొగ్గు ఉత్పత్తిలో దేశంలోనే ఎంతో అనుభవం ఉన్న కంపెనీ సింగరేణి. స్థానికంగా, సహజ సిద్ధంగా ఉన్న పరిస్థితులు బొగ్గు ధరపై ప్రభావం చూపుతున్నాయి. ఉత్పత్తి వ్యయం పెరుగుతున్న కారణంగా బొగ్గు ధరను పెంచాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడున్న భూగర్భ స్థితిగతులు బొగ్గు ఉత్పత్తి వ్యయాన్ని పెంచే విధంగా ఉండటంతో దానిని ఏ విధంగా అధిగమించాలన్న దిశగా సంస్థ సమాలోచన చేస్తోంది. ప్రస్తుతం సింగరేణి కంటే ఇతర బొగ్గు పరిశ్రమల్లో టన్ను బొగ్గు ధర చాలా తక్కువగా ఉంది. సింగరేణితో పోల్చితే వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్స్, మహానది కోల్‌ఫిల్డ్స్‌లో బొగ్గు ధర తక్కువగా ఉంది. సింగరేణి బొగ్గు ఉత్పత్తికి అయ్యే ఖర్చుతో చూసుకుంటే మార్కెట్‌లో విక్రయిస్తున్న ధర తక్కువే. కానీ అంతకంటే తక్కువకు విక్రయించాలంటే సంస్థకు నష్టాలు తప్పవు. దీనిని ఏ విధంగా అధిగమించాలన్న విషయమై యాజమాన్యం ప్రణాళికలు చేసుకుంటుంది. బహిరంగ మార్కెట్‌లో పోటీని ఎదుర్కోవాలంటే తక్కువ ధరకు నాణ్యమైన బొగ్గును విక్రయించడమే మార్గం.

**అనుకూలంగా లేని భూగర్భ పరిస్థితులు**

రాష్ట్రంలోని గోదావరి పరివాహక ప్రాంతంలో బొగ్గు నిక్షేపాలు పుష్కలంగా ఉన్నాయి. అవి చాలా లోతుల్లో ఉండటంతో దానిని వెలికి



తీసేందుకు ఖర్చు ఎక్కువ చేయాల్సి వస్తుంది. ఒడిశాలోని మహానది కోల్‌ఫీల్డ్స్‌లో రెండు టన్నుల మట్టిని వెలికి తీస్తే ఒక టన్ను బొగ్గు ఉత్పత్తి చేయవచ్చు. సింగరేణిలో కనీసం ఆరు నుంచి ఏడు టన్నుల మట్టిని వెలికి తీస్తే తప్ప టన్ను బొగ్గును ఉత్పత్తి చేయలేం. మట్టి తొలగింపునకే సింగరేణిలో ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తుంది. దీని వల్ల ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. భూగర్భంలో బొగ్గు పొరలు ఏర్పడ్డ ప్రాంతాలు కనీసం 300 నుంచి 1200 మీటర్ల లోతుల్లో ఉన్నాయి. గోదావరి పరివాహక ప్రాంతంలో బొగ్గు నిక్షేపాలు ఇప్పటి వరకు 19,000 మిలియన్ టన్నులకు పైగా ఉన్నట్లు గుర్తించారు. ఇవి తక్కువలో తక్కువ 300 మీటర్ల నుంచి అందుబాటులో ఉంటాయి. ప్రస్తుతం మైనింగ్ చేస్తున్న గనుల్లో అవి 600 మీటర్ల వరకు వెళ్లాయి. అందులోంచి వెలికి తీయాలంటే పైన ఉన్న మట్టిని తొలగించాల్సి ఉంటుంది. భారీ మొత్తంలో ఉన్న మట్టిని తొలగించేందుకు వెచ్చించే వ్యయం బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం చూపుతోంది.

**యంత్రాల పని గంటల పెంపుతోనే...**

సింగరేణి గనుల్లో యంత్రాల పని గంటలు పెంచుకోవడం ద్వారా ఉత్పత్తి వ్యయాన్ని నియంత్రించే అవకాశం ఉంటుంది. ఒక్కో యంత్రం రోజుకు 18 గంటలు పనిచేస్తే ఆర్థిక భారం తగ్గుతుంది. ఉపరితల గనుల్లో 19 గంటలు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలి. సింగరేణిలో మొత్తం 828 యంత్రాలు పనిచేస్తున్నాయి. ప్రతి యంత్రం సగటున నాలుగు గంటలు పెంచుకుంటే బొగ్గు ఉత్పత్తి పెరుగుతుంది. ఫలితంగా వ్యయం తగ్గే అవకాశం ఉంది.

# మహిళా ఆర్థిక శక్తి

సారంగాపూర్: మహిళా సంఘాల సభ్యులు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం మహిళా శక్తి పథకాన్ని ప్రారంభించింది. జిల్లాలోని స్వయం సహాయక సంఘాల ద్వారా సూక్ష్మ పరిశ్రమలు, వ్యాపారాలను ప్రోత్సహిస్తూ బలోపేతం చేయడమే లక్ష్యంగా అధికారులు కృషి చేస్తున్నారు. గతంలో సభ్యురాలు రుణం తీసుకోవాలంటే సంఘ సభ్యులంతా కలిసి తీర్మానం చేస్తే బ్యాంకు లింకేజీ రుణం అందించేవారు. ప్రస్తుతం ఎలాంటి షరతులు లేకుండానే బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, అంతర్గత రుణాలు అందిస్తున్నారు. ఒక్కో యూనిట్ నెలకొల్పేందుకు రూ.50 వేల నుంచి రూ.5లక్షల వరకు రుణం అందిస్తున్నారు. దాదాపు వందకు పైగా వ్యాపారాల నిర్వహణకు అవకాశం కల్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1.7లక్షల మంది మహిళా సంఘ సభ్యులు ఉండగా మహిళా శక్తి పథకం కింద జిల్లాలో 9529



వివిధ వ్యాపారాలు చేసుకునేందుకు గుర్తించగా 5477 ఎంపిక చేశారు. ఇందులో 3410 యూనిట్లకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి కింద దాదాపు రూ.9 కోట్ల రుణాలు అందించారు. మార్చిలోపు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసేలా డీఆర్డీవో అధికారులు అవగాహన కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నారు. జగిత్యాల అర్బన్ మండలంలోని సోమన్‌పల్లికి చెందిన సిద్ధం సునీత రూ.5 లక్షల రుణం తీసుకుంది. ఇందులో బ్యాంకు లింకేజీ రూ.లక్ష చొప్పున, లక్‌పతి దీదీ పథకం ద్వారా రూ.2 లక్షలు, స్త్రీనిధి ద్వారా రూ.75 వేలు, పొదుపు నుంచి రూ.1.25 లక్షలతో బ్యూటీ పార్లర్ ఏర్పాటు చేశారు. ప్రతి నెల రూ.15 నుంచి రూ.20 వేల వరకు ఆదాయం పొందడమే కాకుండా మరొకరికి ఉపాధి కల్పిస్తోంది. మండలంలోని పోరండ్లకు చెందిన జుంబర్తి శాంత బ్యాంకు లింకేజీ ద్వారా రూ.4 లక్షలు, స్త్రీనిధి ద్వారా రూ.2 లక్షల రుణం తీసుకున్నారు. గ్రామంలో లేడిస్ ఎంపోరియం, కిరాణ స్టోర్ ఏర్పాటు చేశారు. ప్రతి రూ.10 నుంచి రూ.15 వేల ఆదాయం పొందుతున్నారు.

**ఆదర్శంగా నిలుస్తున్నారు.. - గంగాధర్, ఏపీఎం**

మహిళా శక్తి పథకం ద్వారా వ్యక్తిగత రుణాలు అందించడంతో సొంత వ్యాపారాలు చేసుకుని ఆదాయం సమకూర్చుకుంటున్నారు. ఎవరిపై ఆధారపడకుండా సూక్ష్మ రుణాలు అందించడంతో కుటుంబానికి భారం కాకుండా తోడ్పాటు అందించడమే కాకుండా మరికొంత మందికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

**రూ.5 లక్షల వరకు..- గంగా భవానీ, అధ్యక్షురాలు, మహిళా సంఘం**

గతంలో వ్యక్తిగత రుణాలు అందించేందుకు బ్యాంకులు ముందుకు రాకపోవడంతో సొంత పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడం ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతం సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ఎలాంటి షరతులు లేకుండా రూ.5 లక్షల వరకు రుణాలు అందించడంతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు.

# నీరు ఎత్తిపోసుడెట్లా?



సారంగాపూర్ : గతంలో ఎన్నడూ లేని విధంగా గతేడాది డిసెంబరులోనే గోదావరి ఎండిపోవడంతో నదీ తీరం వెంట ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాలకు నీటి కొరత ఏర్పడింది. దీంతో సాగు ప్రశ్నార్థకంగా మారింది. రాయికల్, బీర్‌పూర్, ధర్మపురి మండలాల్లో గోదావరి వెంట దాదాపు 10 ఎత్తిపోతల పథకాలతోపాటు రైతులు సొంతగా విద్యుత్తు మోటార్లు బిగించి పంట పొలాలకు నీటిని తరలించి సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుతం బీర్‌పూర్ మండలంలోని మంగెళ, కమ్మునూర్, రేకులపల్లె, చిన్న కొల్వాయి పరిధిలో ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. ఇందులో రేకులపల్లె మినహా ఎక్కడా గోదావరిలో నీరు లేకపోవడంతో ఇప్పటికీ పథకాలు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం వరినాట్లు ముమ్మురం కాగా ఎత్తిపోతల పథకాల కింద నారుమడులకు కూడా నీరు రాకపోవడంతో బీళ్లుగా మారే అవకాశముందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోళ్లవాగు ఆధునికీకరణ పనులు పూర్తి కాకపోవడంతో చివరి గ్రామాలకు నీరు చేరే అవకాశం లేకపోగా బీర్‌పూర్, ధర్మపురి మండలాలకు సాగునీటి కష్టాలు ఎదురవనున్నాయని రైతులు వాపోతున్నారు. ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టుల నుంచి గోదావరిలోని నీటిని విడుదల చేసినట్లయితే ఎత్తిపోతల పథకాలకు నీరు చేరి సాగునీటికి ఇబ్బంది లేకుండా ఉండనుందని రైతులు అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నారు.

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం- లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్**

గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి ఎదురు కాలేదు. మార్చి వరకు గోదావరి తీరం వెంట ఎలాంటి సాగునీటి ఇబ్బంది తలెత్తలేదు. సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణం పూర్తయి గేట్లు వేయడంతో గోదావరి ప్రవాహం కొంత తగ్గింది. సమస్యను అధిగమించేందుకు సీఎం, నీటి పారుదలశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి గోదావరిలోకి ఎస్సారెస్పీ ద్వారా 1 టీఎంసీ నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో కలిసి కోరనున్నాం. రైతులకు సాగునీటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటాం.

# కేవీకేలు ఏర్పాటయ్యేనా!



జగిత్యాల : 'ల్యాబ్ టు ల్యాండ్ – ల్యాండ్ టు ల్యాబ్' అనే విధానం సక్రమంగా పనిచేస్తేనే శాస్త్రవేత్తల పరిశోధన ఫలితాలు రైతుల క్షేత్రాలకు చేరతాయి. పైర్లసాగులో తలెత్తే సమస్యలనే శాస్త్రవేత్తలు పరిశోధన అంశాలుగా మలచుకునే అవకాశముంది. ఇదే నేపథ్యంగా భారత వ్యవసాయ పరిశోధన మండలి, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రత్యేకంగా విస్తరణ విభాగాన్ని నిర్వహిస్తుండగా నూతన జిల్లాల వారీగా కేవీకేలను ఏర్పాటు చేయాల్సి ఉంది. దేశవ్యాప్త సాగు సాంకేతికత మార్పిడికి ఆలవాలమైన కేవీకేలను జిల్లాకొకటి ఏర్పాటు చేస్తామన్న కేంద్రప్రభుత్వ నిర్ణయం అమల్లోకి తేవాల్సి ఉంది. ఇప్పటికే కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో ఐసీఏఆర్ పరిధి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న కేవీకేకు రాష్ట్ర వ్యవసాయ వర్సిటీ సాంకేతిక సహకారాన్ని అందిస్తోంది. పెద్దపల్లి జిల్లా రామగిరిఖిల్లాలో ఉద్యాన వర్సిటీ ఆధ్వర్యంలో కేవీకే ఉండగా జగిత్యాల జిల్లా మల్యాలలో ఉద్యాన కేవీకేను ఏర్పాటు చేస్తామన్న హామీని అమల్లోకి తేవాల్సి ఉంది. రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలతో పాటుగా పెద్దపల్లి జిల్లాలోనూ కేవీకేలను ఏర్పాటు చేయాల్సి ఉంది. రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కరీంనగర్‌లో డాట్సెంటర్(ఏరువాక కేంద్రం) ఉన్నందున జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో నూతన ఏరువాక కేంద్రాల ఏర్పాటుకు ఆవశ్యకత ఉంది.

**సేవలు ఇలా..**నూతన జిల్లాల్లో కేవీకేలను ఏర్పాటుచేసి సెంటర్‌ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా, జిల్లా స్థాయి సమగ్ర వ్యవసాయకేంద్రాలుగా తీర్చిదిద్దాలన్న కేంద్ర నిర్ణయం కార్యరూపం దాల్చాల్సి ఉంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పనిచేసే కేవీకేల నిర్వహణ, జీతభత్యాలను పూర్తిగా కేంద్ర వ్యవసాయశాఖనే భరిస్తోంది. పరిశోధనస్థానాల్లో అభివృద్ధిచేసిన నూతన వంగడాలను తొలుత కేవీకేల్లోని క్షేత్రాల్లో సాగుచేసి ఫలితాలను సమీక్షిస్తారు. కేవీకేల్లోని శాస్త్రవేత్తలు నూతన వంగడాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన ఫలితాలపై ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. భూసార పరీక్ష కిట్లు, వ్యవసాయ యంత్రాలు, పరికరాలను రైతులకు అందిస్తారు. వాతావరణ సమాచారం, చీడపీడల నివారణపై రైతులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేస్తారు. ముమ్ముందు కేవీకేల్లో వ్యవసాయ, ఉద్యాన, పశుపోషణ సమాచారం ఒకేచోట లభించి రైతులకు సాగుసంబంధిత సేవలు మరింతగా దరిచేసే అవకాశముంది. కేవీకేల ఏర్పాటుతో పాటుగా ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు పొలాస పరిశోధనస్థానంలో ఆవాల పరిశోధన కేంద్రాన్ని ఏర్పరచాలి, అగ్రి ఇంక్యుబేషన్ సెంటర్‌ను రైతులకు అందుబాటులోకి తేవాల్సి ఉంది. కేంద్ర డిజిటల్ అగ్రిమిషన్ ద్వారా వాతావరణ మార్పులు, పంటల సాగులో నిత్యం ఆచరణీయ అంశాలు, పంటల ధరలు తదితరాలను శాస్త్రవేత్తలు, అధికారులు, పరిశోధనసంస్థల నుంచి నేరుగా రైతుల చరవాణులకు చేరవేస్తే మంచి ఫలితాలు వస్తాయి.

# అడవి ఇక్కడ.. జిల్లా కార్యాలయం అక్కడ



ఎల్లారెడ్డిపేట: జిల్లా ఏర్పడి దాదాపు ఎనిమిదేళ్లు దాటుతున్నప్పటికీ జిల్లా అటవీశాఖ కార్యాలయానికి నోచుకోవడం లేదు. మరోవైపు జిల్లా అటవీశాఖ అధికారులు అప్పటి నుంచి ఇన్‌ఛార్జిలుగానే కొనసాగుతున్నారు. పూర్తిస్థాయి అధికారిని నియమించలేదు. జిల్లా కేంద్రంలో జిల్లా అటవీశాఖ కార్యాలయం ఏర్పాటు, అందులో సిబ్బంది నియామకం తదితర వాటిని ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పరిపాలనా సౌలభ్యం కోసం ప్రభుత్వం 2016 అక్టోబరు 16న నూతన జిల్లాలు, మండలాలను ఏర్పాటు చేసింది. అధికారుల సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు జిల్లాలు, మండలాల విభజన ప్రక్రియను నిర్వహించింది. అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దీని ద్వారా ప్రజల సమస్యలను పరిశీలించి, పరిష్కరించే అవకాశాలు ఉంటాయి. ఇందులో భాగంగానే జిల్లా కార్యాలయాలను ఏర్పాటు చేశారు. వాటిని తొలుత అద్దె భవనాల్లో కొనసాగించినప్పటికీ కొన్నేళ్ల తర్వాత పక్కా భవనాల్లోకి మార్చారు. అయితే జిల్లా అటవీశాఖ అధికారి కార్యాలయం నేటికీ కరీంనగర్‌లోని కొనసాగుతుండటం గమనార్హం.

**మూగబోయిన చరవాణులు** కరీంనగర్ జిల్లా అటవీశాఖ అధికారిణి బాలమణి రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు బాధ్యతలు చూస్తున్నారు. అధికారులు, సిబ్బందికి గతంలో ప్రభుత్వం ఇచ్చిన చరవాణి నంబర్లు మూగబోయాయి. చెట్ల నరికివేత, అటవీభూముల కబ్జా తదితర వాటిపై సమాచారం అందించలేని పరిస్థితి స్థానికులకు ఏర్పడింది. కళ్ల ముందే విలువైన అటవీ సంపద అంతరించిపోతున్నా ఏమీ చేయలేని పరిస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ జిల్లా ఇన్‌ఛార్జి అధికారిణితోపాటు ఇతర అధికారుల వ్యక్తిగత చరవాణి నంబర్లకు ఫోన్ చేస్తే స్పందించడం లేదు. ఒకవేళ ఫోన్ తీసినా దాటవేత ధోరణిని ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అందుబాటులోకి రాని సేవలు**

13 మండలాలతో ఏర్పడిన జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ రేంజ్‌లు కొనసాగుతున్నాయి. వాటికి సంబంధించిన కార్యాలయాలు ఉన్నాయి. జిల్లా అటవీశాఖ అధికారి కార్యాలయం ఏర్పాటు చేయలేదు.

సిరిసిల్ల రేంజ్ పరిధిలో 19,600 హెక్టార్లు, వేములవాడ రేంజ్ కింద మరో 14 వేల హెక్టార్లు మొత్తం కలుపుకొని దాదాపు 33,600 హెక్టార్ల విస్తీర్ణంలో అడవులు విస్తరించి ఉన్నాయి.

వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, చందుర్తి, రుద్రంగి మండలాల్లో ఎక్కువ శాతం అటవీ విస్తీర్ణం ఉంది. సిరిసిల్ల అటవీ అధికారి కల్పనాదేవి, వేములవాడ ఎఫ్ఆర్‌వోగా కలీమొద్దీన్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

సిరిసిల్ల రేంజ్‌లో 6 సెక్షన్లు, 20 బీట్‌లు ఉండగా 9 బీట్ అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వేములవాడ రేంజ్‌లో 7 సెక్షన్లు, 24 బీట్‌లు ఉండగా 14 బీట్ అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఓవైపు పోస్టుల ఖాళీలతో అడవుల సంరక్షణ, వన్యప్రాణుల రక్షణ సక్రమంగా సాగడం లేదనే ఆరోపణలున్నాయి. అడవుల చుట్టూ కందకాలు చెరిపేస్తూ ఆక్రమణలకు పాల్పడుతున్నారు. అడవులకు సమీపంలో వ్యవసాయ భూములున్న కొందరు క్రమంగా అటవీభూమిలోకి చొరబడుతున్నారు. కలప అక్రమ రవాణా, వన్యప్రాణుల వధను పూర్తిస్థాయిలో అరికట్టలేకపోతున్నారు.

# పీజీ కోర్సుల నిర్వహణకు దరఖాస్తు

గోదావరిఖని : గోదావరిఖనిలోని ప్రభుత్వ వైద్య కళాశాల(సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)లో రానున్న విద్యా సంవత్సరంలో పీజీ కోర్సుల నిర్వహణకు ఇటీవల దరఖాస్తు చేశారు. కొత్తగా ఏర్పాటైన వైద్య కళాశాలల్లో కేవలం గోదావరిఖనిలోని వైద్య కళాశాల నిర్వాహకులు మాత్రమే పీజీ కోర్సుల కోసం దరఖాస్తు చేయడం గమనార్హం. జాతీయ మెడికల్ కమిషన్ నిబంధనల ప్రకారం నాలుగు విభాగాల్లో పీజీ కోర్సులు ప్రారంభించే అవకాశముండటంతో వాటికి మాత్రమే దరఖాస్తు చేశారు. పీజీ తరగతుల నిర్వహణతో పాటు పీజీ విద్యార్థులకు ప్రత్యేకంగా వసతి గృహ భవనం సిద్ధంగా ఉంది. అవసరమైన ఇతర సదుపాయాలు సైతం వైద్య కళాశాలలో అందుబాటులో ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో జాతీయ వైద్య కమిషన్‌కు దరఖాస్తు చేశారు.

**నాలుగు విభాగాలు...**

జాతీయ వైద్య కమిషన్ నిబంధనల ప్రకారం గోదావరిఖనిలోని ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాలలో సదుపాయాలు, ఆసుపత్రిలో పడకల స్థాయి, ఇన్‌పేషెంట్లు, ఔట్ పేషెంట్ల సంఖ్య పెరగడం తదితర కారణాలతో ఆయా విభాగాల్లో పీజీ కోర్సుల నిర్వహణకు దరఖాస్తు చేశారు. ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో ప్రసూతి, ఎముకల శస్త్ర చికిత్స విభాగంలో అత్యధిక రద్దీ ఉండగా బయోకెమిస్ట్రీ, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాల్లో ఒక్కో దానిలో నాలుగు సీట్ల చొప్పున పీజీ కోర్సులను మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. ముందుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ, వైద్య విద్య సంచాలకులకు దరఖాస్తు చేయగా వారు ఆమోదం తెలపడంతో ఆయా విభాగాల్లో పీజీ కోర్సులను మంజూరు చేయాలంటూ జాతీయ వైద్య కమిషన్‌కు అవసరమైన దస్త్రాలను సమర్పించారు. ఒక్కో సీటుకు నిర్ణీత రుసుమును రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉండటంతో దానికి సంబంధించి కార్యాచరణ




పూర్తి కావాల్సి ఉంది.

**పెరగనున్న వైద్య సేవలు**

గోదావరిఖని ప్రభుత్వ వైద్య కళాశాలలో పీజీ కోర్సులు మంజూరయితే ఆసుపత్రిలోని ప్రజలకు సైతం మరింత మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఒక్కో విభాగంలో నలుగురు పీజీ విద్యార్థులు రానుండగా ఆయా విభాగాల్లోని సీనియర్ వైద్యులు, ఆచార్యుల పర్యవేక్షణలో వారు వైద్య సేవలందించే అవకాశం ఉంటుంది. జాతీయ వైద్య కమిషన్ అనుమతులు లభిస్తే అదనంగా 16 మంది పీజీ విద్యార్థులు ఓ వైపున కళాశాలలో ఆయా విభాగాల్లో ప్రత్యేక విద్యను అభ్యసిస్తూనే సార్వజనిక ఆసుపత్రిలో వైద్య సేవలందించే అవకాశముంది. ప్రస్తుత పరిస్థితుల్లో అత్యవసర వైద్య సేవలందించడంలో ఎమర్జెన్సీ మెడిసిన్ కోర్సు అత్యవసరంగా భావిస్తున్నారు. వ్యాధుల నిర్ధారణలో బయోకెమిస్ట్రీ విభాగం కీలకమే. ప్రసూతి, ఎముకల శస్త్ర చికిత్సల విభాగంలో నిరంతర రద్దీ ఉంటుంది. పీజీ కోర్సుల్లో చేరిన విద్యార్థులు రెండో సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో సేవలందిస్తారు. కోర్సు పూర్తయిన తర్వాత మరో ఏడాది పాటు తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలందించాలనే నిబంధన ఉండటంతో ఆయా విభాగాల్లో సేవలు మెరుగుపడే అవకాశముంది.

# ముంచుకొస్తున్న గడువు... పూర్తికాని పనులు

ధర్మపురి: ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈనెల 10న ముక్కోటి(వైకుంఠ) ఏకాదశి ఉత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది. వారం రోజుల గడువే ఉండగా ఏర్పాట్లు వేగంగా సాగడం లేదు. ఈ ఉత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఉదయత్ పూర్వమే స్వామి వారికి ఉత్తర ద్వారం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు.

**నదీ తీరంలో....** గోదావరినది వద్ద పురపాలకసంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు గతంలో కంటే కొంత మెరుగైనా ఇంకా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాల్సి ఉంది. పురపాలకసంఘం శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ ఆధ్వర్యంలో ఇప్పటికే రెండు పుష్కరఘాట్ల వద్ద చెత్తచెదారాన్ని తొలగింపజేసి, మెట్లపై ఇసుక పోయించి పాకురును తొలగింపజేశారు. పది చోట్ల చెత్తకుండీలను ఏర్పాటు చేశారు. దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేశారు.

**మెరుగైన రవాణా సదుపాయం కల్పించాలి**

ముక్కోటి ఏకాదశి ఉత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నందున కరీంనగర్, ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులను నడిపించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ధర్మపురికి మెరుగైన రవాణా



సదుపాయం లేక భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీనితో పాటు ప్రత్యేకంగా ఆలయం వద్దకు వృద్ధులు, దివ్యాంగులు చేరేలా ఉచిత సదుపాయం కల్పించాల్సిన అవసరం ఉంది. ఆర్టీసీ బస్టాండు వద్ద కనీస సదుపాయాలు లేవు. పూర్తి స్థాయి కంట్రోలర్‌ను నియమించలేదు. తాగు నీటి సదుపాయాలు ఏమాత్రం లేవని భక్తులు వాపోతున్నారు. ఆర్టీసీ బస్డాండులో సదుపాయాలు మెరుగు పరచాల్సిన అవసరం ఉంది.

**సమన్వయ సమావేశమేదీ..?**

ముక్కోటి ఏకాదశి సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాల్సి ఉండగా నేటికీ చేపట్టలేదనే విమర్శలు ఉన్నాయి. ఆలయంలో విద్యుద్దీపాలం కరణ, ఉత్తర ద్వారం, ఉత్సవ వేదికలకు రంగులు వేయాల్సిన అవసరం ఉంది. ఈ పనులను త్వరిత గతిన ప్రారంభించాల్సి ఉంది. స్వామివారి ఊరేగింపు సేవలు చేపట్టే మార్గాలన్నీ అధ్వానంగా మారాయి. పలు రోడ్లు బండరాళ్లు, గుంతలతో ఇబ్బందికరంగా మారాయి. ముక్కోటి ఏకాదశి ఉత్సవ తేదీలపై ముందస్తుగా ప్రచారం చేపట్టడం లేదు. దేవస్థానంలో కొన్నేళ్లుగా, ఉత్సవాల పూజలు, ఉత్తర ద్వారాన్ని తెరవడం ఆలస్యంగా జరుగుతోందని భక్తులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది.

# వేసవికి ముందే కటకట

హైదరాబాద్:గతేడాది జనవరి నుంచి డిసెంబరు 20 వరకు ఒక వినియోగదారుడు 525 ట్యాంకర్లు బుక్ చేయగా, మరొకరు 518 ట్యాంకర్లు, ఇంకొకరు 491 బుక్ చేశారు. ఇలాంటి అంశాలను పరిశీలించి వాస్తవ డిమాండ్‌ను విశ్లేషిస్తున్నారు. వేసవికి ముందే నగరంలో నీటి ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. ఇటీవల ఎన్నడూ లేని విధంగా డిసెంబరులోనే జలమండలి ట్యాంకర్ల కోసం వినతులు పెరుగుతున్నాయి. ముమ్ముందు ట్యాంకర్ల భారీ డిమాండ్‌కు ఇది ముందస్తు సంకేతంగా జలమండలి భావిస్తోంది. దీంతో వేసవి కార్యాచరణకు సిద్ధమవుతోంది.

**తగ్గిన భూగర్భ జలాలు**

2023 డిసెంబరు కంటే 2024 డిసెంబర్ నాటికి జలమండలి పరిధిలో కొన్ని ప్రాంతాల్లో భూగర్భజల మట్టాలు తగ్గిపోవడమే కారణమని పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఉన్న ట్యాంకర్లు, ఫిల్లింగ్ స్టేషన్లు మార్చి వరకు సరిపోతాయని, డిమాండ్ పెరిగితే అందుకు అనుగుణంగా ట్యాంకర్లు, ఫిల్లింగ్ స్టేషన్లను పెంచుకునేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం 600 ట్యాంకర్లు ద్వారా నీటిని సరఫరా చేస్తుండగా, అదనంగా



మరో 200 ట్యాంకర్లను సిద్ధం చేసుకుంటోంది. ప్రస్తుతం 77 ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్లు ఉండగా, వీటి పెంపునకు కసరత్తు చేస్తున్నారు.

**ప్రణాళికలు సిద్ధం**

జలమండలి ఎండీ కె.అశోక్‌రెడ్డి ఇటీవల అధికారులతో సమావేశమై వేసవి కార్యాచరణ ప్రణాళికకు తుది రూపు ఇచ్చారు. గతేడాది ఆరు డివిజన్లలో 20 సెక్షన్లలో నీటి సమస్య తలెత్తింది. ఆ ప్రాంతాల్లో రానున్న వేసవిలో ఎలాంటి పరిస్థితి ఉంటుందనేది అంచనా వేసి, అందుకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కొందరు వినియోగదారులే భారీగా వాటర్ ట్యాంకర్లు బుక్ చేస్తున్న అంశాన్ని జలమండలి అధికారులు గుర్తించారు.గతేడాది మార్చిలో 1.69 లక్షలు, ఏప్రిల్‌లో 2.45 లక్షలు, మేలో 2.28 లక్షలు, జూన్‌లో 1.8 లక్షలు, జులైలో 1.47 లక్షల ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు.

# మా పని మాదే.. మీ పని మీదే

హైదరాబాద్ : ఒక వైపు అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతుంటే కొందరు అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. చెరువులను ఆక్రమిస్తున్నా.. సుందరీకరణ పేరుతో గేటెడ్ కమ్యూనిటీల్లో కలిపేసుకుంటున్నా స్పందించడం లేదు. అటు అధికారులు.. ఇటు అక్రమార్కులు ఎవరి పని వారిదే అన్నట్లుగా సాగుతున్నారు. కొద్దినెలల క్రితం ముగ్గురు సాగునీటి పారుదల శాఖ అధికారులు అనిశాకు చిక్కారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 89 చెరువుల్లో అక్రమ నిర్మాణాలున్నా ఎన్వోసీలిచ్చారు.

రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో 2,540 చెరువులుండగా వాటి విస్తీర్ణం, వివరాలు రెవెన్యూ రికార్డుల్లో భద్రంగా ఉన్నాయి. హైదరాబాద్‌కు సమీపంలోని శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, ఖాజాగూడ, రాయదుర్గం, కోకాపేట, వట్టినాగులపల్లి, శంషాబాద్, కూకట్‌పల్లి, బాచుపల్లి, దుండిగల్ ప్రాంతాల్లో చెరువులకు సమీపంలోనే ఐదారేళ్లుగా గేటెడ్ కమ్యూనిటీలు, బహుళ అంతస్తుల భవనాలు, ఫంక్షన్‌హాళ్ల నిర్మాణం భారీగా జరిగింది. వీరిలో కొందరు బఫర్‌జోన్‌లో నిర్మాణాలు చేపట్టి వాటిని తమ స్థలాల్లో కలిపేసుకున్నారు. మరికొందరు వెంచర్లను ప్రైవేటు పట్టాభూములతో కలిపి బఫర్‌జోన్లలో వేస్తున్నారు. శంషాబాద్



మండలంలో పది చెరువుల బఫర్‌జోన్‌ల హద్దులను అధికారులు మార్చేశారు. చిన్నగోల్కొండ నరసింహ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఫంక్షన్‌హాల్‌ను నిర్మించారు.

**సుందరీకరిస్తాం... చెరపడతాం**

శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ జోన్లలో కొందరు రియల్ సంస్థల ప్రతినిధులు కార్పొరేట్ సామాజిక భద్రతలో భాగంగా చెరువులను సుందరీకరిస్తామని అధికారులతో కొద్దినెలల క్రితం ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందుకు 27 చెరువులను అప్పగించారు. ఇదే అదునుగా ఓ నిర్మాణ సంస్థ నాలుగు ఎకరాలకుపైగా ఆక్రమించుకోగా... మరో రియల్ సంస్థ పార్కు కోసం రెండు ఎకరాలు ఆక్రమించి దాని చుట్టూ ప్రహరీ నిర్మించింది. ఇంకో రియల్ సంస్థ.. బఫర్‌జోన్‌లో వాకింగ్ ట్రాక్‌ను నిర్మించి తమ గేటెడ్ కమ్యూనిటీ మాత్రమే ఉపయోగించుకునేలా చేసుకుంది.

# కొత్త రేషన్‌కార్డులపై వారంలో కీలక ప్రకటన

హైదరాబాద్: కొత్త రేషన్‌కార్డుల కోసం నగరవాసుల ఎదురుచూపులకు తెరపడనుంది. సంక్రాంతి తర్వాత ఈ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు అధికార వర్గాలు స్పష్టతనివ్వడంతో ఆశావహులు దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. నగరం నుంచి కొత్తగా సుమారు లక్ష దరఖాస్తులు వస్తాయని అధికారవర్గాల అంచనా. ప్రస్తుతం హైదరాబాద్ జిల్లా పరిధిలో 6,39,506 రేషన్‌కార్డులుండగా 15నుంచి 20శాతం పెరుగుదల ఉంటుందని పౌరసరఫరాల శాఖ అధికారులు భావిస్తున్నారు. హైదరాబాద్



చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ పరిధిలో ప్రస్తుతం 653 చౌకధరల దుకాణాలుండగా వీటిలో 66డీలర్ల స్థానాలు ఖాళీగా ఉండగా.. ప్రస్తుతం 587 చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ సరఫరా అవుతోంది. ప్రభుత్వం అర్హతలను నిర్దేశించి అవకాశం కల్పించినప్పుడు కొత్త వాటి కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని అధికారులు వివరిస్తున్నారు. విషయమై కొత్త రేషన్‌కార్డులకు సంబంధించి వారంలోపే నిర్ణయం ఉంటుందని పేర్కొంటున్నారు.

# వేటు పడుతున్నా.. మారని రూటు



హైదరాబాద్ : నగరం ఉత్తరమండల పరిధిలోని ఓ ఠాణాకు ఆయన ఇన్‌స్పెక్టర్. అక్కడ పనిచేసే హెడ్‌కానిస్టేబుల్ ఆయన కుడి భుజం. బాధితుల నుంచి ఏ ఫిర్యాదు వచ్చినా అతని ద్వారానే స్వీకరిస్తారు. బంగారం చోరీ కేసులపై ప్రత్యేక శ్రద్ధచూపుతారు. తాజాగా ఒక మహిళ 20 తులాల బంగారం పోగొట్టుకుంది. అదే ప్రాంతంలో పసిడి ఆభరణాల తయారీ కేంద్రంలో బంగారం మాయమైంది. ఈ రెండు కేసుల్లో నిందితులు పట్టుబడ్డారు. రికవరీ చేసిన సొత్తులో ఇంతే దొరికిందంటూ బాధితుల నోరు మూయించారు. దక్షిణమండలం పరిధిలో ఒక ఇన్‌స్పెక్టర్ దుకాణం ఖాళీ చేయించేందుకు దొంగతనం జరిగినట్టు నాటకమాడి కమీషన్ ఇచ్చిన వారికి అనుకూలంగా వ్యవహరించాడనే ఆరోపణలున్నాయి. గతేడాది నగర సీసీఎస్‌లో వరుస ఏసీబీ తనిఖీలు పోలీసు యంత్రాంగాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఒక ఏసీపీని, లంచం తీసుకుంటున్న ఒక ఇన్‌స్పెక్టర్‌ను ఏసీబీ అరెస్ట్ చేసింది. 2024లో గ్రేటర్ పరిధి మూడు పోలీసు కమిషనరేట్లలో ఏసీపీ నుంచి కానిస్టేబుల్ వరకూ 50-55 మంది అవినీతి, అక్రమ కార్యకలాపాల్లో తలదూర్చి సస్పెన్షన్‌కు గురయ్యారు. వీరిలో 30 మంది నగరం నుంచే కావటం పరిస్థితికి అద్దంపడుతోంది. ప్రస్తుతం మరో 30 మంది ఇన్‌స్పెక్టర్లు, 10 మంది ఏసీపీలపై వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణలపై అంతర్గత విచారణ జరుగుతోంది. వీరిలో సగం మందిని సస్పెండ్ చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం.

**కాసుల వేటలో పోటీ**

గతేడాది 3 కమిషనరేట్లలో 91,887 కేసులు నమోదయ్యాయి. వీటిలో 35,944 కేసులు హైదరాబాద్‌లోనివే. ఇళ్లలో దొంగతనాలు, దృష్టి మరల్చి చోరీలు, ఇంటి దొంగలు, వాహన చోరీలు ఎక్కువ. డ్రగ్స్ నివారణ విభాగంలో పనిచేస్తున్న ఒక ఇన్‌స్పెక్టర్ మత్తు పదార్థాలు చేరవేస్తున్న నిందితులను కేసు నుంచి తప్పించేందుకు రూ.5 లక్షలు డిమాండ్ చేశాడనే ఆరోపణలున్నాయి. సైబరాబాద్ పరిధిలో ఒక ఏసీపీ తన పరిధిలోని ఠాణాలకు నెలవారీ ఇవ్వాల్సిన మూమూళ్ల లక్ష్యాన్ని నిర్దేశించినట్టు సమాచారం. బాలానగర్ జోన్ పరిధిలో ఒక ఇన్‌స్పెక్టర్ స్థల వివాదాల్లో భారీగా సొమ్ము చేసుకున్నాడు. రాచకొండ పరిధిలో పోలీసు ఉన్నతాధికారి ఇద్దరు ఇన్‌స్పెక్టర్లతో కలసి సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నట్టు ఆరోపణలున్నాయి. మాదాపూర్ జోన్ పరిధిలో ఒక పోలీసు అధికారి ప్రైవేటు స్థలం వివాదాన్ని పరిష్కరించి రూ.40 లక్షలకుపైగా లబ్ధిపొందినట్టు తెలుస్తోంది. నగర పరిధిలో ఒక ఇన్‌స్పెక్టర్ నిందితుడిని అదుపులోకి తీసుకొని ఇంటిపనులకు వాడుకుంటున్నట్టు ఉన్నతాధికారులు గుర్తించారు. తూర్పుమండలంలో ఇన్‌స్పెక్టర్ ఇద్దరు కానిస్టేబుళ్లతో దుకాణాలు, బార్లు, మద్యం షాపుల నుంచి నెలవారీ వసూళ్లకు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది. దక్షిణ మండలంలో ఓ ఇన్‌స్పెక్టర్ కేసును బట్టి రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకూ తీసుకుంటాడనేది బహిరంగ రహస్యం. సస్పెన్షన్, బదిలీ అయిన ఎస్సైలు 30మంది ఉంటే వారిలో 20 మంది పాల్పడినవారేనట.

# చిరుధాన్యం.. ఆరోగ్యభాగ్యం



పరిగి : మారుతున్న జీవనశైలి, బయట ఆహారపదార్థాలు తినడం వల్ల పిన్న వయస్సులోనే అనారోగ్యాల పాలవుతున్నారు. వీటికి అడ్డుకట్ట వేసేందుకు చిరుధాన్యాలను వినియోగించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల అనేక ప్రయోజనాలు చేకూరుతాయన్న విషయం అనేక పరిశోధనల్లోనూ నిరూపితం అయింది. వీటి వల్ల శరీరానికి కావాల్సిన పొటాషియం, మెగ్నీషియం, ఇనుము, జింకు క్యాల్సియం వంటి సూక్ష్మపోషకాలు అందుతాయి. అంతేకాకుండా యాంటీ ఆక్సిడెంట్లు, అమైనోఆమ్లాలు, పీచు పదార్థాలు అధికంగా ఉంటాయి. వీటిని ఆహారంగా తీసుకుంటే రోజువారి పోషకాలు లభిస్తాయి. జిల్లాలోని ప్రధాన పట్టణాలు పరిగి, తాండూరు, వికారాబాద్, కొడంగల్‌లో చిరుధాన్యాల వినియోగంపై ప్రజలు దృష్టి సారిస్తున్నారు. అయితే సరిపోను లేక అధిక ధర చెల్లించాల్సి వస్తోంది. ఇటువంటి పరిస్థితిలో చిరుధాన్యాల సాగు పెంచితే ప్రయోజనం ఉంటుంది.

**తక్కువ నీటిని వినియోగించి..**

తెల్ల, పచ్చ జొన్నలు క్వింటా ధర మార్కెట్లో వడ్ల కంటే రెండింతలు అధికంగా ఉంది.రాగులకు మరింత ఎక్కువ. జిల్లాలో వరి సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. ఖరీఫ్, యాసంగిలో వరికి నిరంతరం తడులు అందించాల్సి ఉంటుంది. ఆరుతడి పంటలైన జొన్నలు, రాగులు, కొర్రలు, సామలు తదితరాలను తక్కువ నీటి తడులతో పండించవచ్చు. వడ్లు క్వింటా ధర రూ.2,300 నుంచి రూ2,800 వరకు ఉండగా, జొన్నలు రూ.5వేల నుంచి రూ.6 వేలు, రాగులు రూ.8 వేల నుంచి 10 వేలు పలుకుతోంది. ఇలాంటి పంటలు సాగు చేస్తే తక్కువ శ్రమతో రైతులు మంచి ఆదాయం పొందే వీలుంటుంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఆ దిశగా రైతులను ప్రోత్సహిస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో అవగాహన లేక వరివైపే మొగ్గు చూపుతున్నారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని వారికి వివరిస్తే మార్పు వచ్చే అవకాశం ఉంది.

**రొట్టెల విక్రయంతో ఉపాధి**

ఆరోగ్యంతో పాటు, సమయం కలిసి వస్తుందన్న కారణంతో వినియోగదారులు రొట్టెలు కొనుగోలు చేస్తున్నారు. పట్టణాల్లో వీటికి గిరాకీ పెరగడంతో వీధివీధినా దుకాణాలు ఏర్పాటు అవుతున్నాయి. పలువురికి జీవనోపాధి కూడా లభిస్తోంది. 10 రొట్టెలతో ప్యాకెట్లుగా చేసి అమ్ముతున్నారు.


**చెలక.. తేలికపాటి నేలలు..**

పరిగి డివిజన్‌లో అధిక శాతం చెలక, తేలిక పాటి నేలలున్నాయి. బోరుబావులు కూడా ఇక్కడే అధికం. ఈ నేలలు అన్నిరకాల పంటల సాగుకు అనువుగా ఉంటాయి. ఈ ప్రాంతంలో సాగుచేసిన చిరుధాన్యాలు మార్కెట్‌కు తరలిస్తే, కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ఆసక్తి చూపలేదు. దీంతో కాలక్రమేణా సాగు విస్తీర్ణం పడిపోయింది. ఈ ప్రభావం ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజల ఆరోగ్యంపై పడి, చాలా మందిలో పోషకాహార లోపం కనిపిస్తోంది. ముఖ్యంగా ఈ సమస్య మహిళల్లో అధికంగా కనబడుతోందని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. గతేడాది రబీలో 60 ఎకరాలు సాధారణ సాగు, ఉండగా ప్రస్తుతం అందులో సగం కూడా సాగులోకి రాలేదు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో మంచి ధరలు పలుకుతున్నా, సజ్జలు, కొర్రలు ఇతర ఆరుతడి పంటల సాగు కనిపించడంలేదు.

**రైతులను ప్రోత్సహిస్తాం..**

ప్రభుత్వ ప్రోత్సాహంతో కొన్ని స్వచ్ఛంద సంస్థలు చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నాయి. రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వీటిని అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు సాగు విస్తీర్ణాన్ని పెంచే దిశగా కార్యాచరణ చేపట్టాం.రజిత, ప్రభాకర్‌రావు, పరిగి, దోమ వ్యవసాయాధికారులు

# పల్లెలకు యంత్రాంగం.. సమస్యల పరిష్కారం!



పరిగి : గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతం కానుంది. ఇందుకోసం ప్రభుత్వం ఇప్పటికే క్షేత్రస్థాయిలో కసరత్తు దాదాపుగా పూర్తిచేసింది. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒకరి చొప్పున అధికారులను నియమిస్తున్నట్లు భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. గత ప్రభుత్వం వివిధ శాఖల్లోకి బదలాయించిన వీఆర్వో, వీఆర్ఏలకు వీఎల్‌వోలుగా అవకాశం కల్పిస్తోంది. ఈ మేరకు ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులను స్వీకరించింది. దీంతో జిల్లాకు 510 మంది రానున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో చాలా మంది వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. అర్హులను గుర్తించి ఎంపిక చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం, ఈ బాధ్యతలను కలెక్టర్లకు అప్పగించింది. ఈప్రక్రియ రెండు రోజుల క్రితమే పూర్తవడంతో త్వరలోనే వారికి శుభవార్తను అందించే అవకాశముంది.

తొలగనున్న ఇక్కట్లు: రెవెన్యూ శాఖలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. గత ప్రభుత్వం వీఆర్ఏలు, వీఆర్వోలను ఇతర శాఖల్లోకి పంపడంతో సమస్య మరింత జటిలంగా మారింది. మండల కార్యాలయాల్లో పనిచేసే ఆర్ఐలు కూడా పూర్తిస్థాయిలో లేకపోవడంతో సేవలు అందడంలేదు. కొత్త వ్యవస్థ పటిష్టంగా మారితే చాలా వరకు సమస్యలు తీరనున్నాయి. జిల్లాలో పరిగి, మోమిన్‌పేట, తాండూరు, ధారూర్, పూడూరు, కుల్కచర్ల, నవాబుపేట, పెద్దేముల్, బొంరాస్‌పేట తదితర మండలాల్లో ఎర్రమట్టి, ఇసుక అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. అధికార యంత్రాంగానికి సమాచార లోపం కూడా తోడవడంతో అక్రమార్కుల ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. ఇలాంటి వాటికి ఇకపై కొంతైనా అడ్డుకట్ట పడనుందని రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు.

**పక్కా పర్యవేక్షణకు ఆస్కారం..**

భూ పరిపాలన సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వం గ్రామస్థాయిలో అధికారులను నియమిస్తోంది. ప్రభుత్వ భూముల పరిరక్షణ, అభివృద్ధి పనులకు సంబంధించిన సమాచారం, ప్రజలకు క్షేత్రస్థాయిలోనే వివిధ రకాల సేవలను అందించేందుకు కొత్త వ్యవస్థ ప్రయోజనకరంగా మారనుంది. జిల్లా అంతటా సిబ్బంది సేవలు అందుబాటులోకి వస్తే పర్యవేక్షణకు ఆస్కారం ఉంటుంది.లింగ్యానాయక్, అదనపు కలెక్టర్.

# పై వంతెనలపై దడదడే

హైదరాబాద్: హైటెక్‌సిటీలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన శిల్పా లేఅవుట్ పైవంతెనపై పగుళ్లు వచ్చాయి. నాలుగుచోట్ల ఎక్స్‌పాన్షన్ జాయింట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 40ఏళ్లపాటు మన్నిక ఇవ్వాల్సిన స్పాన్లు.. రెండేళ్లకే మరమ్మతుకు గురయ్యాయి. అడిగితే.. ముఖ్య ఇంజినీరు నుంచి కార్యనిర్వాహక ఇంజినీరు వరకు సమాధానం చెప్పట్లేదు. దాదాపు అన్ని పైవంతెనల్లో ఇలాంటి సమస్యలు తలెత్తుతుంటాయని, గుత్తేదారు ఖర్చుతోనే మరమ్మతులు చేయిస్తున్నామని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు హరీశ్‌బాబు తెలిపారు. జాయింట్ల వద్ద ఇంజినీరింగ్ తప్పిదాన్ని కప్పిపుచ్చుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని, శిల్పా లేఅవుట్ పైవంతెనతోపాటు నిర్మించిన ఇతర పైవంతెనలు, నగరంలో దశాబ్దాల క్రితం నిర్మించినవి సవ్యంగా ఉన్న విషయాన్ని వాహనదారులు గుర్తుచేస్తున్నారు.



**వాహనదారుల బెంబేలు**

మైండ్‌స్పేస్ కూడలిని ఓఆర్ఆర్‌తో కలుపుతూ రూ.250కోట్లతో నిర్మించిన శిల్పాలే అవుట్ మొదటిస్థాయి పైవంతెన నవంబరు 24, 2022న ప్రారంభమైంది. ప్రయాణిస్తున్నప్పుడు చిన్నపాటి శబ్దం వస్తుందని మొదట్నుంచే ఫిర్యాదులు మొదలయ్యాయి. ఇంజినీర్లు పట్టించుకోకపోవడంతో సమస్య పెద్దగా మారింది. నాలుగు ఎక్స్‌పాన్షన్ జాయింట్లు కదిలిపోయాయి. అతుకుల వద్ద హెచ్చుతగ్గులకు గురైంది. ఆలస్యంగా గుర్తించిన ఇంజినీర్లు.. వారం క్రితం మరమ్మతు పనులు చేపట్టారు.ఆర్నెల్ల క్రితం బైరామల్‌గూడ పైవంతెనపైనా పగుళ్లు వచ్చాయి. సరిగ్గా కూడలిపై కాంక్రీటు స్లాబు దెబ్బతింది. సమస్యను వెలుగులోకి తీసుకురాగా.. అధికారులు మరమ్మతు చేయించారు.

# పీహెచ్‌డీ ప్రవేశాలు ప్రకటనలకే!

హైదరాబాద్: ప్రజలకు.. సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు.. కొత్త ఆవిష్కరణలు.. వినూత్న అంశాలను ప్రపంచానికి పరిచయం చేసేందుకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(పీహెచ్‌డీ) ప్రవేశం పొందాలనుకుంటున్న విద్యార్థులకు వారి పరిశోధనలు గడువులోగా పూర్తయ్యేలా మార్గనిర్దేశనం చేసే పర్యవేక్షకులు లేరు. 11ఏళ్లుగా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుల పోస్టులను భర్తీ చేయకపోవడం. పదేళ్లలో వందలమంది ఆచార్యులు పదవీ విరమణ చేయడంతో పీహెచ్‌డీ ప్రవేశం పొందాలనుకున్నవారు తీవ్రంగా నిరాశపడుతున్నారు. ఉస్మానియా, జేఎన్‌టీయూ, ఆర్కిటెక్చర్, డాక్టర్ అంబేడ్కర్, తెలుగు విశ్వవిద్యాలయాల్లో పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేస్తున్నా.. అవి ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఏటా 700మంది విద్యార్థులకు పీహెచ్‌డీ చేసేందుకు గతంలో అవకాశం లభిస్తుండగా.. ప్రస్తుతం వందమందికి కూడా లభించడం లేదు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఆచార్యుల కొరత కారణంగా మూడేళ్ల నుంచి పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేయలేదు.విశ్రాంత ఆచార్యులతో నెట్టుకొట్టుస్తున్నా.. విశ్వవిద్యాలయాల్లో డిగ్రీ, పీజీలతోపాటు పీహెచ్‌డీ ప్రవేశాలూ ముఖ్యమే. కొత్త ఆవిష్కరణలు, పరిశోధనలు ఎన్ని కనుగొంటే ఆయా విశ్వవిద్యాలయాల ప్రతిష్ఠ అంత పెరుగుతుంది. బహుళజాతి సంస్థలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంస్థలు, డిపార్ట్‌మెంట్‌ఆఫ్ సైన్స్, టెక్నాలజీ, బయోటెక్నాలజీ విభాగాలు, రాష్ట్ర ప్రభుత్వాలు విశ్వవిద్యాలయాల్లో కొనసాగే పరిశోధనలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి.



పరిశోధక విద్యార్థులకు పర్యవేక్షకుడిగా విశ్వవిద్యాలయాల్లో విధులు నిర్వహించే ప్రొఫెసర్ స్థాయి ఆచార్యుడు ఉండాలి. కీలక వర్సిటీల్లో ప్రొఫెసర్లు పదవీ విరమణ చేస్తున్న క్రమంలో.. వర్సిటీ అధికారులు, ఉన్నతవిద్యామండలి ఉన్నతాధికారులు చర్చించి విశ్రాంతఆచార్యులు పర్యవేక్షకులుగా ఉండేందుకు అనుమతులివ్వాలని యూజీసీని అభ్యర్థించడంతో అంగీకరించారు. తాజాగా.. మూడేళ్లలోపు పీహెచ్‌డీ పరిశోధన పూర్తవ్వాలంటూ నిబంధన విధించింది. దీంతో ఆరేడేళ్ల నుంచి విశ్రాంత ఆచార్యులతో నెట్టుకొస్తున్నారు.

**తెలుగు విశ్వవిద్యాలయం.. మరింత దయనీయం..**

తెలుగు విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసేందుకు ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొన్నాయి. తెలుగు, ఇంగ్లిష్, జర్నలిజం సహా కీలక విభాగాల్లో శాశ్వత ఆచార్యులు లేరు. ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీచేస్తే విద్యార్థులకు పర్యవేక్షకులుగా వ్యవహరించే ఆచార్యులు లేరు. పదేళ్లుగా నియామకాలు చేపట్టలేదు. దీంతో దూరవిద్య ఎంఏ, తెలుగు, ఇంగ్లిష్ కోర్సులను రద్దుచేశారు.

# రూ.కోట్లు వెచ్చించి.. మూలకు చేర్చి..!

తాండూరు : ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రభుత్వం రూ.కోట్లు నిధులు మంజూరు చేస్తున్నా, క్షేత్రస్థాయిలో మార్పు రావడంలేదు. తాండూరు పురపాలక సంఘంలో ఇదే పరిస్థితి నెలకొంది. పట్టణ పరిశుభ్రత కోసం కొనుగోలు చేసిన వాహనాలను కార్యాలయాలకే పరిమితం చేస్తున్నారు. దీంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారడంతో పాటు ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. తాండూరు పురపాలికలో 2022లో రూ.1.36 కోట్లతో 18 ఆటోలు, మిగతా నిధులతో ట్రాక్టర్లు, ఇతర వాహనాలు కొనుగోలు చేశారు. కేవలం 7 ఆటోలను మాత్రమే వినియోగిస్తున్నారు. ఏళ్ల తరబడి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పుపడుతున్నాయి. మూడేళ్ల కిందట రూ.36లక్షలు వెచ్చించి రోడ్లపై దుమ్ము తొలగించే యంత్రాన్ని కొనుగోలు చేశారు. పట్టణ రోడ్లు యంత్రానికి అనువుగా లేదని మూలన పడేశారు. ట్రాక్టర్ల పరిస్థితీ అదే తీరుగా ఉంది. జేసీబీ సైతం పనికి రాకుండా పోయింది. ఆటోలను మరమ్మతు చేసేందుకు ప్రైవేట్ మెకానిక్‌లకు ఇచ్చారు. డబ్బులు ఇవ్వలేదని అక్కడే ఉండిపోయాయి. బ్యాటరీతో నడిచే ఆటో నిరుపయోగంగా వదిలేశారు.చెత్త తరలింపురకు ఆటంకాలు: వాహనాలను ఉపయోగించకపోవడంతో పట్టణంలో చెత్తను పూర్తి స్థాయిలో తరలించలేకపోతున్నారు. పట్టణవ్యాప్తంగా 42 మెట్రిక్ టన్నుల తడి, పొడి చెత్త వెలువడుతోంది.

# ఉత్తరాలు రాసేద్దాం

గోదావరిఖని : లేఖ అంటే కేవలం కాగితం.. సిరా చుక్క మాత్రమే కాదు. దాని విలువెంటో చరవాణులు లేనికాలంలో ఉద్యోగ నియామక పత్రానికి ఎదురుచూసిన నిరుద్యోగికి, దూర ప్రాంతంలో ఉన్న కొడుకు యోగక్షేమాలపై కంగారు పడే తల్లిదండ్రులకే తెలుస్తోంది. పైగా చేతిరాతతో ఆలోచనశక్తి పెరుగుతోంది. ఈ డిజిటల్ యుగంలో లేఖల ప్రాధాన్యాన్ని తెలిపేలా తపాలా శాఖ ప్రయత్నం చేస్తోంది. జాతీయ స్థాయిలో 'డాయ్ ఆఖర్' పేరిట లేఖ రచన పోటీలు నిర్వహిస్తోంది. ఈ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో నగదు బహుమతులు అందజేస్తుంది.

**అంతా డిజిటల్ మయం**

ఈరోజుల్లో మనం సమాచారం పొందాలన్న.. చేరవేయాలన్న కంప్యూటర్లు, చరవాణుల మీద ఆధారపడుతున్నా. ముఖ్యంగా చరవాణుల వల్ల లేఖలకు ప్రాధాన్యం లేకుండా పోయింది. చరవాణి చేతిలోకి వచ్చాక ఉత్తరాల వ్యవస్థ పూర్తిగా మరుగునపడింది. ఆన్‌లైన్‌లోనే సంక్షిప్త సమాచారాలు, మెయిళ్లు, ఫోన్‌తో మాట్లాడుకునే సదుపాయం వచ్చింది. ఇలా ఉత్తరాలకు ఆదరణ కరవైంది. ఈ నేపథ్యంలో ఉత్తరాల రచనపై ప్రజల్లో అవగాహన కల్గించడంతో పాటు చేతిరాతను ప్రోత్సహించేలా తపాలా శాఖ పోటీలు నిర్వహిస్తోంది.

**చివరి తేదీ డిసెంబరు 14**

లేఖ కవరుపైన వయసు రాసి, అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని జత చేయాలి.

DHAI AKHAR

National Level Letter Writing Competition

చీఫ్ పోస్టుమాస్టర్ జర్నల్, తెలంగాణ సర్కిల్, హైదరాబాద్– 500001 చిరునామాకు డిసెంబరు 14వ తేదీలోపు లేఖలు పంపాలి.

**నిర్వహణ ఇలా..**ఈ ఏడాది 'డిజిటల్ వ్యవస్థలో ఉత్తరాల ప్రాధాన్యత(ఇంపార్టెన్స్ ఆఫ్ లెటర్స్ ఇన్ డిజిటల్ ఏజ్)' అంశంపై పోటీలు నిర్వహిస్తున్నారు. ఆంగ్లం, హిందీతో పాటు వాడుక భాషలో చీఫ్ పోస్టు మాస్టర్‌కు ఉత్తరం రాయాలి.

18 సం.ల లోపు వారు ఒక కేటగిరీ.. 18 సం.ల పైబడిన వారు ఒక కేటగిరీగా రెండు విభాగాల్లో పోటీలు ఉంటాయి.

ఏ4 కాగితంలో ఇన్‌లాండ్ లెటర్‌లో 500 పదాలకు మించకుండా, ఎన్విలప్‌లో వెయ్యి పదాలకు మించకుండా రాసి.. ఉత్తరాలు పంపాలి. సర్కిల్(రాష్ట్ర) స్థాయిలో 2025 జనవరి 23న ఫలితాలు వెల్లడిస్తారు. జాతీయ స్థాయి ఫలితాల తేదీని తర్వాత ప్రకటిస్తారు.

ఒక్కో కేటగిరీలో ముగ్గురి చొప్పున రాష్ట్ర(సర్కిల్), జాతీయ స్థాయిలో విజేతలను ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో రూ.25వేలు, రూ.10వేలు, రూ.5వేలు వరుసగా ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతులు ప్రదానం చేస్తారు. జాతీయ స్థాయిలో రూ.50వేలు, రూ.25వేలు, రూ.10వేలు అందజేస్తారు.

**అభినందనీయం**

లక్ష్మీనారాయణ, ప్రధానోపాధ్యాయులు, ప్రభుత్వ పాఠశాల ఎల్కలపల్లి తపాలా శాఖ నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విద్యార్థి, యువతలో చేతిరాతపై ఆసక్తి పెరిగే అవకాశముంది. పోటీల్లో విద్యార్థులు, యువత పాల్గొనేలా విద్యాసంస్థలతో పాటు వివిధ వర్గాలు కృషి చేయాలి. గతంలో ఉత్తరాలతో వ్యక్తుల నడుమ అనురాగాలు, ఆప్యాయతలు పెంపొందేవి. ఉత్తరాల సంస్కృతిని కొనసాగించాలనే లక్ష్యంతో తపాలా శాఖ పోటీలు నిర్వహించడం అభినందనీయం.

**పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు..**

తపాలా శాఖకు పూర్వ వైభవం తీసుకురావడానికే ఈ పోటీలు నిర్వహిస్తోంది. ఒకప్పుడు చేతిరాతతో రాసిన లేఖలు బాంధవ్యాలను దృఢపరిచేవి. వ్యక్తుల మధ్య అనురాగం, ఆప్యాయత, అభిమానానికి ప్రతీకలుగా నిలిచేవి. వాటికి పెద్దపీట వేయడంతోపాటు దస్తూరికీ ప్రాధాన్యం ఇస్తున్నాం.పి.శివాజీ, జిల్లా తపాలా శాఖ పర్యవేక్షకుడు

# నాసిరకం.. నాణ్యతాలోపం

నిజామాబాద్ : గతుకుల రోడ్లు.. ధ్వంసమైన కాల్వలు.. ఖాళీ ప్రదేశాల్లో నిలిచిన మురుగు.. శివారు కాలనీలకు మట్టిరోడ్లు.. ఇదీ జిల్లాకేంద్రం పరిస్థితి. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆయా కాలనీల నుంచి వస్తున్న వినతులపై స్పందించి ఉన్నతాధికారులతో మాట్లాడారు. నగరపాలక సంస్థకు పన్నుల రూపేణ వస్తున్న నిధులను మౌలిక వసతుల కోసం కేటాయించేలా ఒప్పించారు. ప్రజలు కట్టిన పన్నులతో చేపడుతున్న పనులు ఇష్టారీతిన చేపడుతూ అందినకాడికి దండుకుంటున్నారు.

**డివిజన్‌కు రూ.10 లక్షలు**

జిల్లా కేంద్రంలో 60 డివిజన్లు ఉన్నాయి. ప్రతి డివిజన్‌కు రూ.10 లక్షల చొప్పున రూ.6 కోట్ల నిధులు కేటాయించారు. సగానికి పైగా డివిజన్లలో భూమి పూజలు చేసి పనులు ప్రారంభించారు. కొన్నిచోట్ల ఇప్పటికే పనులు పూర్తయ్యాయి. వీటితో పాటు గతంలో అపరిష్కృతంగా ఉన్న పనులు, సామాజిక భవనాలకూ నిధులు కేటాయించారు. ఈ స్థాయిలో పలు అభివృద్ధి పనులు కొనసాగుతుంటే కనీస పర్యవేక్షణ లేకపోవడం గమనార్హం.

**ఏఈలే బినామీలు..**

నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఏఈలు(అసిస్టెంటు ఇంజినీర్లు) కొన్నేళ్లుగా బినామీ గుత్తేదారుల అవతారం ఎత్తారు. ఇప్పటికే ఇద్దరు ఏఈలను పర్యవేక్షణ చేయకపోవడం, బినామీలుగా మారడంతో గుర్తించి ఉన్నతాధికారులు పక్కనపెట్టారు. వారు పైరవీలు చేసుకొని మళ్లీ విధుల్లో చేరారు. కొన్నాళ్లుగా నిధులు, పనులు లేకపోవడంతో స్తబ్దుగా ఉన్నారు. ఇప్పుడు మౌలిక వసతుల కల్పనకు నిధులొచ్చాయి. ఎప్పటికప్పుడు నాణ్యతను పరిశీలించాల్సిన వీరు.. బినామీ గుత్తేదారులుగా అవతారమెత్తారు.

**ఏం చేస్తున్నారంటే?**

నిబంధనల ప్రకారం ఓపీసీ(ఆర్డినరీ పోర్ట్‌ల్యాండ్ సిమెంటు)ను వినియోగించాలి కానీ, ఎక్కడా వాడటం లేదు. ప్రస్తుతం కొనసాగుతున్న సీసీరోడ్ల పనుల వద్ద కొన్ని సిమెంటు బస్తాలకు ఓపీసీ ఉంటే.. మరికొన్నిచోట్ల నోరుతిరగని పేరున్న బస్తాలు వాడుతున్నారు.నాలుగు రోజుల క్రితం సుభాష్‌నగర్‌లో పబ్లిక్‌హెల్త్ కార్యాలయం పక్కన సీసీ రోడ్డు నిర్మాణంలో కొన్ని సంచులు ఓపీసీ ఉంటే.. మిగతావి నాసిరకం బస్తాలు ఉపయోగించారు.

నుడా నిధులతో అయ్యప్ప ఆలయం ప్రహరీ నిర్మాణానికి సైతం నాసిరకం సిమెంటు వాడారు.ఆనంద్‌నగర్ పద్మశాలీ సంఘం సమీపంలో మురుగు కాల్వ నిర్మాణంలోనూ ఇదే పరిస్థితి. వంపులు తింపుతూ కాల్వ నిర్మిస్తున్నారు. ఇలా చేస్తే నీరు వెళ్లే పరిస్థితి ఉండదని కాలనీవాసులు వాపోతున్నారు.

**మా దృష్టికి తీసుకురండి**

నాణ్యతా లోపం ఉంటే మా దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటాం. మీరు చెప్పిన విషయాలపై ఈ రోజే విచారణ చేయిస్తా. గతంలో బినామీగా మారి పనులు చేపడితే ఏఈని పక్కన పెట్టాం. మురుగు కాల్వలు, సీసీ రోడ్ల పనుల్లో సిమెంటుకు బదులు డస్టు వాడినట్లు తేలితే ఆ పనులు ఆపేస్తాం.

– మురళీమోహన్‌రెడ్డి, ఈఈ, నగరపాలక సంస్థ

# ఆయకట్టు కాల్వలు ఇలా.. సాగునీరు అందేదెలా!



ఎల్లారెడ్డిపేట: ప్రస్తుతం యాసంగి పనులను రైతులు ప్రారంభించారు. ఇప్పటికే జిల్లాలోని వివిధ మండలాల్లో నార్లు పోయడం, పొలాలను దున్నే ప్రక్రియ క్రమంగా ఊపందుకుంటోంది. యాసంగి సీజన్‌లో చెరువులు, కుంటల నుంచి ఆయకట్టు భూములకు సాగునీటిని విడుదల చేయాల్సి ఉంది. అయితే ఆయకట్టు కాల్వలు పూడికతో నిండిపోయాయి. చెట్లు పెద్ద మొత్తంలో పెరిగి కాల్వలు కనిపించకుండా అస్తవ్యస్తంగా తయారయ్యాయి. కాల్వలు అధ్వానంగా తయారవడంతో నీరు పొలాలకు చేరని పరిస్థితి నెలకొంది.

జిల్లాలో బోరుబావులు, ఓపెన్ బావులపైనే ఆధారపడి రైతులు వ్యవసాయం చేస్తున్నారు. జిల్లాలో చాలా చెరువుల్లో నీరు పుష్కలంగా ఉంది. అక్టోబరులో జిల్లాలో భూగర్భ జలాలు సగటున 5.83 మీటర్లలో ఉన్నాయి. యాసంగి సీజన్‌లో జిల్లాలో పంటల సాగు ప్రణాళికను అధికారులు రూపొందించారు.

వరి 1,74,311 ఎకరాల్లో, మొక్కజొన్న 1431, నువ్వు 362, పొద్దుతిరుగుడు 810, శనగ 178, ఇతర పంటలు 317 ఎకరాల విస్తీర్ణంలో సాగవుతాయని అంచనా వేశారు.

ఓవైపు నీటి వనరుల్లో సమృద్ధిగా నీరుండటం, భూగర్భజల మట్టాలు ఆశాజనకంగా పెరిగినా జిల్లాలోని కొన్ని మండలాల్లో విచిత్ర పరిస్థితి నెలకొంది. తలాపునే నీటితో కళకళలాడే చెరువులున్నా భూగర్భజల మట్టాలు తగ్గిపోతుంటాయి. ఆయకట్టు కాల్వల్లో నీరు పారితేనే బోరుబావులు రీఛార్జి అవుతుంటాయి.

తలాపునే గోదారి ఉన్నా నీరు వదలకపోతే బీడు భూములుగా మారే ప్రమాదం నెలకొంది. ఇప్పటికే చాలా వరకు బోరుబావులు తక్కువగా పోస్తున్నాయి. ప్రస్తుతం బోరు బావుల ఆధారంగా రైతులు సాగును ప్రారంభించారు. ఒకవేళ నీటి విడుదల ఆలస్యమైతే బోరుబావులు మొండికేసి, వేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఉంటుందని రైతులు చెబుతున్నారు.

ఆయకట్టు కాల్వల గుండా సాగునీరు ప్రవహిస్తేనే బోర్లలో జలధార పెరుగుతుందని చెబుతున్నారు.

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ శివారులోని జక్కుల చెరువు కట్ట పొడవు 600 ఎకరాలు. దీని కింద రాచర్ల బొప్పాపూర్, రాచర్ల గొల్లపల్లి, సర్వేయపల్లిలో 494 ఎకరాల ఆయకట్టు ఉంది. వ్యవసాయ పొలాలకు సాగునీరు అందించే కాల్వ పూడికతో నిండిపోయింది. పైగా ఇరువైపులా చెట్లు విపరీతంగా పెరిగిపోయి అపరిశుభ్రంగా మారి, కనిపించకుండా తయారైంది. ఇది ఒక్కటే కాదు. జిల్లాలో చాలా చోట్ల ఇదే పరిస్థితి నెలకొన్నా పూడిక తీసిన దాఖలాలు లేవు.

**వెంటనే పనులు ప్రారంభించాలి**

జక్కుల చెరువు ఆయకట్టు కాల్వలో పూడిక తీత పనులను వెంటనే ప్రారంభించాలి. ఈ ప్రాంతంలో కాల్వ గుండా నీరు పారితేనే బోరుబావుల్లో నీరు ఉబుకుతుంది. ప్రస్తుతం కాల్వ కింది భాగాన ఉండే చాలా మంది రైతులు నార్లు పోసి, పొలాలను దున్నడం ప్రారంభించారు. ఆయకట్టుకు నీరందించే ప్రక్రియ ఆలస్యమైతే బోర్లు ఎత్తిపోయే ప్రమాదం ఉంది. ఇదే జరిగితే కనీసం నారుమడులను తడపడం కూడా కష్టం అవుతుంది. అధికారులు వెంటనే స్పందించాలి.

**ఎల్లయ్య, రైతు, రాచర్ల బొప్పాపూర్**

**నివేదికలు రూపొందించాం**

మండలంలోని అక్టోబరు 2 నుంచి నవంబరు 3 వరకు వివిధ పనులను గుర్తించాం. అనేక గ్రామాల్లో ఆయకట్టు కాల్వల్లో పూడికతీత, వాటిని శుభ్రపర్చడంతోపాటు ఇతరత్రా పనులకు గ్రామ సభల్లో తీర్మానం చేశాం. ఉపాధి హామీ పథకంలో చేపట్టాల్సిన పనులకు అంచనాలు తయారు చేశాం. నిధుల మంజూరు కోసం త్వరలోనే ప్రభుత్వానికి పంపిస్తాం. ఆయకట్టు కాల్వల్లో పూడికతీత పనులను వేగవంతంగా పూర్తి చేస్తాం.

కొమురయ్య, ఏపీవో, ఈజీఎస్

# కూరగాయలసాగు.. లాభాలు బాగు



పెద్దపల్లి : మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా కూరగాయల సాగు చేస్తూ కాల్వశ్రీరాంపూర్ మండలంలోని గంగారం గ్రామ పరిధిలోని ఊషన్నపల్లి రైతులు లాభాల బాటలో పయనిస్తున్నారు. గతంలో పత్తి, మిర్చి, వరి, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేసి దిగుబడి రాకపోవడంతో ఆరుగాలం శ్రమించిన అన్నదాతలు.. ఆది నుంచి ఏ పంట వేసినా తెగుళ్లు సోకి దిగుబడులు రాక, పెట్టిన పెట్టుబడి కూడా చేతికి అందకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. వాతావరణ మార్పుతోపాటు వర్షాభావ పరిస్థితులు కర్షకులను కూరగాయాల సాగుపై దృష్టి సారించేలా చేశాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయలకు మంచి ధరలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తమకు లాభాల పంట పండుతోందని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సుమారు 500 మంది రైతులు ఉంటారు. ఇందులో 100 మందికి పైగా కూరగాయలు సాగు చేస్తున్నారు. గ్రామంలో సుమారు 16 వందల ఎకరాల విస్తీర్ణం ఉంటుంది. 60 ఎకరాలకు పైగా కూరగాయలను పండిస్తున్నారు.

**డిమాండ్‌ను పసిగట్టి..**

రైతులు వ్యూహాత్మకంగా కూరగాయల సాగు చేస్తున్నారు. మార్కెట్లో ఏ సీజనులో వేటికి డిమాండ్ ఉంటుందో పసిగట్టి ఆ నారు పోస్తున్నారు. సాగు వ్యయాన్ని తగ్గించుకునేందుకు వీలుగా కూలీలపై ఆధారపడకుండా కుటుంబ సభ్యులే ప్రారంభం నుంచి పంట ముగిసే వరకూ పనుల్లో నిమగ్నమవుతున్నారు. పెద్దపల్లి మార్కెట్‌తోపాటు కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్, ఓదెల మండలాల్లోని గ్రామాల్లో వారాంతపు సంతల్లో విక్రయిస్తున్నారు. టమాట, బెండ, మిరప, బీర, కాకర, సొరకాయ, మెంతి, పాలకూర, వంకాయ, క్యారెట్, చిక్కుడు, కాలీఫ్లవర్ తదితరాలు సాగు చేస్తున్నారు. కూరగాయల ధరలు ఆశాజనకంగా ఉండటంతో తమకు లాభాలు వస్తున్నాయని అన్నదాతలు చెబుతున్నారు.

**శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలి**

పండించిన కూరగాయలను నిల్వ చేసుకోవడానికి ప్రభుత్వం గ్రామాల్లో శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలి. కూరగాయల లభ్యత ఎక్కువ ఉన్నప్పుడు, ధర తక్కువ ఉన్న సమయంలో శీతల గిడ్డంగులు ఉంటే రైతులు కూరగాయలను నిల్వ ఉంచుకొని ధర వచ్చినప్పుడు విక్రయించుకునే వెసులుబాటు కలుగుతుంది. మా కుటుంబ సభ్యులందరం కలిసి 2 ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తాం. మార్కెట్ సీజన్ చూసి కూరగాయ విత్తనాలు నాటుతాం.రైతు, ముస్కు శ్రీనివాస్

**రోజు వారీ ఆదాయం**

అర ఎకరంలో టమాట, బెండ, వంకాయ, మిర్చి సాగు చేశాను. పత్తి సాగు కంటే కూరగాయల సాగులోనే లాభాలు అధికంగా ఉన్నాయి. కూరగాయల విక్రయంతో రోజూ ఆదాయం వస్తుంది. దీంతో పత్తి సాగుకు పెట్టుబడి సమస్య ఉండటం లేదు. ఎప్పటికప్పుడు కూలీలకు డబ్బు చెల్లిస్తున్నాం. కష్టపడితే కూరగాయల సాగు లాభసాటిగా ఉంటుంది.రైతు, ముష్కె అశోక్

# మిగిలింది వంతెన ఆనవాళ్లే..!

తిరుమలాయపాలెం : ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల మధ్యలో ఆకేరుపై మూడున్నరేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం రూ.12 కోట్లతో వంతెన నిర్మించింది. దీన్ని అధికారికంగా ప్రారంభించకముందే ఇటీవల వరద ఉద్ధృతికి కొట్టుకుపోయింది. సుమారు 10 పిల్లర్లు తూర్పు దిశకు వంగి ప్రమాదకరంగా మారాయి. రెండు జిల్లాల మధ్య రాకపోకలు సాగించే వారికి మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడు, జల్లేపల్లి, హైదర్‌సాయిపేట, రావిచెట్టుతండా నుంచి మహబూబాబాద్ జిల్లా ధర్మారం, కురవి, సీరోలు, డోర్నకల్ వెళ్లేందుకు వీలుగా ఈ వంతెన ఎంతగానో ఉపయోగపడేది. వంతెన నిర్మాణానికి ముందు వాహనదారులు, చిరు వ్యాపారులు, రైతులు మరిపెడ (బంగ్లా)కి వెళ్లి చుట్టూ తిరగటం వల్ల సుమారు 50 కి.మీ. దూరభారం పెరిగేది. వంతెన నిర్మాణంతో దూరభారం తగ్గటంతో పాటు ప్రధాన రహదారికి సమీపంలోని భూముల విలువ పెరిగింది. రెండు జిల్లాలను కలుపుతూ ఆకేరుపై వంతెన నిర్మించటం వల్ల మాబాధలు తీరాయని అనుకున్నాం. అంతలోనే వరదలకు వంతెన కొట్టుకుపోయింది. మళ్లీ మాకు పాతరోజులే వచ్చాయి. అధికారులు స్పందించి వంతెనను త్వరితగతిన పునర్నిర్మించాలి.

గుగులోతు శంకర్, రావిచెట్టుతండా

వరద ఉద్ధృతి తగ్గిన తరువాత అక్కడి పరిస్థితిని పరిశీలించాం. వంతెన పునర్నిర్మాణంపై ఉన్నతాధికారులకు నివేదించాం. వారి ఆదేశాల మేరకు ఆకేరుపై వంతెన నిర్మాణ పనులు చేపడతాం.

సరస్వతి, జేఈ, ఆర్అండ్‌బీ

# పొదుపు పాఠాలు!

కరీంనగర్ : రూపాయి రూపాయి పొదుపు చేస్తే అది వందలు.. వేలల్లో నుంచి లక్షల్లోకి మారుతుంది. పొదుపు ద్వారా అత్యవసర, భవిష్యత్తు అవసరాలు తీర్చుకునేందుకు అవసరమైన డబ్బు కోసం వెదుకులాడుకునే పని లేకుండా చేస్తుంది. జీవిత గమనాన్ని మార్చే డబ్బు పొదుపును ప్రతి ఒక్కరూ పాటించాల్సిందే. ముఖ్యంగా బాల్యం నుంచే ఈ అలవాటు చేయాలి. విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో వారికి పొదుపు పాఠాలు అంతే అవసరం. అదే పనిని ఉమ్మడి జిల్లాలోని కొన్ని పాఠశాలల్లో ఆచరిస్తున్నారు. చదువుతోపాటు ఆర్థిక పాఠాలను కూడా ఉపాధ్యాయులు నేర్పిస్తున్నారు.

**ఆర్థిక క్రమశిక్షణతో భవిష్యత్తుకు భరోసా**

ఉమ్మడి జిల్లాలో అన్ని రకాల పాఠశాలలు 1071 ఉండగా, వాటిల్లో 1,57,648 మంది బాలలు చదువుతున్నారు. క్రమశిక్షణ, చదువు, వ్యక్తిత్వ వికాసం వంటివి బడుల్లో అందుతున్నా బాలలకు ఆర్థిక క్రమశిక్షణ నేర్పడం లేదు. బాల్యం నుంచి పాటించే అలవాట్లు భవిష్యత్తులో కూడా వాటినే పాటిస్తారు. బాల్యం నుంచి ఉన్నత విద్యాభ్యాసం వరకు విద్యార్థులు తల్లిదండ్రులు లేదా ఉపకార వేతనాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. పేద, ఆర్థికంగా చితికిన గ్రామీణ కుటుంబాల విద్యార్థుల్లోనూ భవిష్యత్తు చదువులు, కోచింగ్, స్టడీ మెటీరియల్, ఇతరత్రా అవసరాల కోసం కొంత సొమ్మును దాచుకోవాలనే అవగాహన ఉండటం లేదు. ఎదిగిన కొద్దీ ఫ్యాషన్ పోకడలను పుణికి పుచ్చుకుంటున్న యువతరం చరవాణి కొనివ్వలేదని, బైక్ కొనేందుకు డబ్బులివ్వలేదని క్షణికావేశంలో ప్రాణాలు తీసుకుని తల్లిదండ్రులకు శోకాన్ని మిగులుస్తున్న సంఘటనలు ఉమ్మడి జిల్లాలో చూస్తున్నాం. చిన్నప్పటి నుంచే డబ్బు విలువ, పొదుపు అవసరం నేర్పితే విద్యార్థులు ఇలాంటి తీవ్ర నిర్ణయాలు తీసుకునే పరిస్థితి ఉండదు.

**డబ్బు విలువ తెలిసేలా..**

జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం తక్కల్లపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆర్థిక పాఠాలను నేర్పిస్తున్నారు. విద్యార్థులు చేతి ఖర్చుల కోసం, ఇతర అవసరాల కోసం పొందే డబ్బుల నుంచి కొంత మొత్తాన్ని పొదుపు చేసుకునేలా ఆరో తరగతిలో వారు ప్రవేశం పొందిన నాటి నుంచే ప్రోత్సహిస్తున్నారు. పోస్టాఫీసులో వారికి తోచిన మొత్తాన్ని దాచుకునేలా చేస్తున్నారు. విద్యార్థులే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు సంచయిక పథకం కింద బడి పేరుతో తీసిన ఖాతాలో విద్యార్థులు దాచుకోవాల్సిన డబ్బులను ఓ ఉపాధ్యాయుడి ద్వారా సేకరించి వాటిని అందులో జమ చేస్తున్నారు. ఇందు కోసం విద్యార్థులకు పాకెట్ పాస్ బుక్‌ను జారీ చేస్తున్నారు. పొదుపు చేసిన మొత్తం నుంచి విద్యార్థులకు అవసరమైనప్పుడు డబ్బులను తీసి ఇస్తున్నారు. 12 ఏళ్ల నుంచి ఈ విధానం కొనసాగుతుండటంతో విద్యార్థులు సొమ్ములను దాచుకుంటూ వారి చిన్న చిన్న అవసరాలకు తల్లిదండ్రులపై ఆధారపడకుండా స్టడీ మెటీరియల్, విజ్ఞాన, విహార యాత్రల కోసం వాటిని వాడుకుంటున్నారని ప్రధానోపాధ్యాయుడు ఎం.రవీందర్ తెలిపారు. ఇప్పటి వరకు సుమారు 450 మంది విద్యార్థులు పైగా ఇలా చేశారని ప్రస్తుతం 60 మంది బాలలు ఇలా పొదుపు చేసుకుంటున్నారని వివరించారు.

**ఆర్థిక క్రమశిక్షణ నేర్పాలని...**

గంగాధర మండలం ఒద్యారం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు పొదుపు పాఠాలను నేర్పిస్తున్నారు. నిత్యం చిరుతిళ్ల కోసం డబ్బులను ఖర్చు చేస్తున్న బాలలను చూసి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ రావు ప్రత్యేకంగా వారికి ఆర్థిక క్రమశిక్షణను అలవాటు చేయాలనుకున్నారు. ఇందులో భాగంగా పాఠశాలలోని విద్యార్థులకు సమీప బ్యాంకులో వారికి తోచినంత డబ్బులను దాచుకునేలా ప్రోత్సహించారు. బ్యాంకు అధికారులు కూడా అండగా నిలిచి పాఠశాలకే వచ్చి 28 మంది విద్యార్థులకు బ్యాంకు ఖాతాలను ఉచితంగా అందించారు. విద్యార్థుల డబ్బు ఖాతాలో జమ చేసేందుకు ఒక ఉపాధ్యాయుడికి బాధ్యతలు అప్పగించారు. దీంతో విద్యార్థులు దుబారా ఖర్చులను తగ్గించి పొదుపు చేసుకుంటున్నారని ప్రభాకర్ రావు తెలిపారు.

**బడి బ్యాంకులు తెరవాలి**

గతంలో ఉమ్మడి జిల్లాలో బడి బ్యాంకులు, పోస్టాఫీసుల్లో సంచయిక పథకాలను బాలల ముంగిట నిలిపి పొదుపు వైపు ప్రోత్సహించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఉపాధ్యాయులు చొరవ చూపితేనే బడి బ్యాంకులు సాధ్యమవుతాయి.

చదువులకు అంతరాయం కలగకుండా విద్యార్థులే బడి బ్యాంకు వ్యవహారాలను కొనసాగించేలా చూడాలి.

ప్రతి పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడితో పర్యవేక్షణ చేయించాలి.

**ప్రయోజనాలు ఇలా..** విహార యాత్రలు, జన్మదిన వేడుకలకు సొంతంగా డబ్బులు సమకూర్చుకోవడంతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

చదువుకు అవసరమైనవి సొంతంగా కొనుగోలు చేసుకుంటారు. ఈ క్రమంలో కచ్చితంగా అవసరమైనవే కొంటారు.చిరుతిళ్లను మానుకుని ఆరోగ్యంగా ఉంటారు.బ్యాంకు కార్యకలాపాలు, లావాదేవీల గురించి అవగాహన కలుగుతుంది.

# అటకెక్కిన ఆర్థిక సాయం

ఖమ్మం: అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, సహాయకులకు అందించాల్సిన ఉద్యోగ విరమణ ఆర్థిక సాయం అటకెక్కింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష చొప్పున ఇస్తామని ప్రకటించింది. అయితే అందుకు సంబంధించి నిధులు మంజూరుకాలేదు. ఇప్పటికే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 65 ఏళ్లు దాటిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను ఉద్యోగం నుంచి తొలగించారు. 2024 జులై 1 నుంచి జీతభత్యాలను నిలిపేశారు.

**ఉభయ జిల్లాల్లో 359 మంది..**

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 65ఏళ్ల వయసు నిండిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు 359 మంది వివరాలు నమోదైనట్లు అధికారులు గుర్తించారు. వచ్చే ఏప్రిల్ 1 నాటికి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. గతంలో 70 ఏళ్లు దాటినా విధులు నిర్వర్తించేవారు. స్వచ్ఛందంగా పని చేయలేమని విరమించుకున్న అంగన్‌వాడీ టీచర్లకు రూ.60వేలు, ఆయాలకు రూ.30వేల చొప్పున సర్కారు చెల్లించేది. ప్రసుత్తం ఐసీడీఎస్ సిబ్బందికి ఉద్యోగ విరమణ వయసును నిర్ణయించి, రిటైర్‌మెంట్ సమయంలో అందించే ఆర్థిక సాయాన్ని పెంచినా అమలుపరచటంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోందనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. **సిబ్బంది ఆందోళనలతో..**అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఉద్యోగ విరమణ అనంతరం ఎలాంటి ఆర్థిక సాయం పొందేవారు కాదు. అందుకే తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగ విరమణ సమయంలో ఉపాధ్యాయులకు రూ.5లక్షలు, ఆయాలకు రు.2లక్షల చొప్పున ఆర్థిక సాయమందించాలని గతంలో ఆందోళన బాటపట్టారు. అప్పటి భారాస ప్రభుత్వం స్పందించి సిబ్బంది ఉద్యోగ విరమణ వయసును 65 ఏళ్లుగా నిర్ణయించింది. ఉద్యోగ విరమణ సమయంలో టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50వేల చొప్పున ఆర్థిక సాయమందించాలని ఉత్తర్వులు వెలువరించింది. సమ్మెకు మద్దతు తెలిపిన కాంగ్రెస్ పార్టీ సైతం కనీస వేతనం రూ.18వేల చెల్లింపుతో పాటు వివిధ హామీలు గుప్పించింది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. గత జులైలో టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష చొప్పున రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇస్తామని హామీ ఇచ్చింది.



# తెదేపా నేతలపై దాడి కేసు.. తురకా కిశోర్‌కు 14 రోజుల రిమాండ్

పల్నాడు: తెదేపా నేతలు బొండా ఉమా మహేశ్వరరావు, బుద్దా వెంకన్నపై దాడి కేసులో నిందితుడు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు తురకా కిశోర్‌కు మాచర్ల జూనియర్ సివిల్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఆదివారం అతడిని హైదరాబాద్‌లో అరెస్టు చేసిన ఏపీ పోలీసులు.. కోర్టులో హాజరుపరిచారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం రెండు వారాల రిమాండ్ విధించింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అరాచకాలకు పాల్పడటంతో నమోదైన కేసుల నేపథ్యంలో మే 22న పిన్నెల్లి సోదరులు హైదరాబాద్‌కు పారిపోయారు. అప్పటి నుంచి వారి అనుచరులు కూడా అజ్ఞాతంలోకి వెళ్లారు. తరువాత పిన్నెల్లి సోదరులిద్దరూ ముందస్తు బెయిల్‌పై బయట ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆరు నెలలుగా కిశోర్.. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న తన అన్న శ్రీకాంత్ వద్దే ఉన్నట్లు సమాచారం. హైదరాబాద్‌లో పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని కలిసేందుకు వస్తున్నాడన్న సమాచారం మేరకు విజయపురి సౌత్ ఠాణా ఎస్సై షఫీ బృందం రెండ్రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లింది. ఈ క్రమంలో ఉదయం కిశోర్‌ను, అతని సోదరుడు శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకుని.. మాచర్లకు తీసుకొచ్చారు. కిశోర్‌పై మూడు హత్యాయత్నాలతోపాటు మరో ఏడు ఇతర కేసులున్నాయి. గత స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా వైకాపా నేతలు మాచర్ల నియోజకవర్గంలోని బొదిలవీడులో తెదేపా వారిని నామినేషన్లు వేయనీయకుండా కిశోర్ అడ్డుకున్నారు. దీంతో పార్టీ ఎన్నికల పరిశీలకులుగా బొండా ఉమ, బుద్ధా వెంకన్నలను చంద్రబాబు అక్కడికి పంపారు. వీరి కారు మాచర్ల సాగర్ రింగ్‌రోడ్డు వద్దకు రాగానే కర్రలు, కత్తులతో సిద్ధంగా ఉన్న వైకాపా నేతలు దాడులకు తెగబడ్డారు. బొండా ఉమ, బుద్ధా వెంకన్నలు ప్రయాణిస్తున్న కారు అద్దాల్లో నుంచి పెద్ద కర్రలతో కిశోర్ వారిపై దాడి చేశాడు. ఈ వీడియోలు అప్పట్లో సంచలనం రేకెత్తించాయి. ఆ దాడిలో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. అతడిపై చర్యలు తీసుకోవాలంటూ తెదేపా నేతలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని ఆదివారం అరెస్టు చేశారు.

# మూడు నెలల్లో మేము ఇవ్వబోయే ఉద్యోగాలు ఇవే.. లోకేష్ ప్రకటన



పశ్చిమగోదావరి జిల్లా: రాబోయే మూడు నెలల్లో టీసీఎస్ ఇన్నోవేషన్ హబ్‌ను ఏపీలో తీసుకురాబోతున్నామని మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. పదివేల మందికి ఉపాధి కల్పించబోతున్నామని చెప్పారు. ప్రపంచానికి టాటా బ్రాండ్‌ను పరిచయం చేసిన వ్యక్తి రతన్ టాటా అన్నారు. విలువలతో కూడిన పారిశ్రామిక వేత్త రతన్ టాటా అని తెలిపారు. దేశీయ ఉత్పత్తులు, బ్రాండ్ దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకున్న వ్యక్తి రతన్ టాటా అని ప్రశంసించారు. హైదరాబాద్‌లో బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్‌కు రూ.25 కోట్లు, హుద్ హుద్ తుపాను సమయంలో మూడు కోట్లు విరాళం ఇచ్చిన వ్యక్తి రతన్ టాటా అని గుర్తుచేశారు. భీమవరంలో మంత్రి నారా లోకేష్ పర్యటించారు. పెదఅయినంలో రతన్‌టాటా కాంస్య విగ్రహం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడారు. ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు ఫైర్ బ్యాండ్ అని మంత్రి నారా లోకేష్ ప్రశంసల వర్షం కురిపించారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఉండి నియోజకవర్గ అభివృద్ధి సంస్థను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. విద్యార్థులను చూస్తుంటే తన కాలేజ్ రోజులు గుర్తుకు వస్తున్నాయని చెప్పారు. తాను కష్టకాలంలో ఉన్నప్పుడు తనకు తోడుగా ఉన్నది తన మిత్రులు, బంధువులు అనే చెప్పారు. టీడీపీకి ఉండి నియోజకవర్గం కంచుకోట అన్నారు. ఆర్ఆర్ఆర్ అంటే రియల్, రెస్పాన్సిబుల్ అండ్ రెబల్ అని కొనియాడారు. ఏ పోలీసులయితే ఆయనను కొట్టారో వారికి సొంత నిధులతో వాహనాలు కొనిచ్చారని చెప్పారు. ఏపీ చాలా ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని... ప్రతీనెల రూ. 4 వేల కోట్లతో ప్రభుత్వం నడుస్తుందని చెప్పారు. ఈ సంక్షోభాన్ని విద్యార్థులు ఒక అవకాశంగా మలుచుకోవాలని చెప్పారు. విద్యాశాఖ చాలా కష్టమైన శాఖ అని తెలిపారు. కష్టమైన శాఖలను ఎంచుకోవడం తనకు ఇష్టమన్నారు. కష్టకాలంలో మనతో నిలబడిన వారితో కలిసి వెళ్లాలని చెప్పారు. కేజీ నుంచి పీజీ వరకు పాఠ్యాంశాలను మార్చాలని భావిస్తున్నామని అన్నారు. పాఠ్య పుస్తకాల్లో రాజకీయ నాయకుల ఫొటోలు లేవు అని చెప్పారు. పార్టీల రంగులు లేవు, తమకు ఆ పిచ్చి లేదని అన్నారు. చట్టాల్లో కాదు..మార్పు రావాల్సింది అవగావన పెంచుకోవడంలో రావాలని అన్నారు. ఆడ, మగ విషయాల్లో సమానత్వం రావాలని చెప్పారు. పాఠ్యాంశాల్లో ఆ అంశాలు ప్రతిబింబించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. డ్రగ్స్ వద్దు క్యాంపెయిన్ రూపొందించామని తెలిపారు. విద్యార్థులు అటువంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వద్దు బ్రో.. డోంట్ బీ ముఖేష్ అంటూ మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు.

# రెరా అధికారులపై మంత్రి నారాయణ ఆగ్రహం



విజయవాడ, జనవరి 6: రెరా అధికారులపై మంత్రి నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టడంపై మంత్రి ఫైర్ అయ్యారు. ఏపీ రెరాలో పెండింగ్ దరఖాస్తులపై మంత్రి ఈరోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రేరా అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెరాలో అనుమతుల కోసం నెలల తరబడి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి పలువురు బిల్డర్లు, డెవలపర్లు తీసుకొచ్చారు. ఎనిమిది నెలలుగా ఎందుకు దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాలనే దరఖాస్తురాదులను వేధింపులకు గురి చేస్తునట్లు మంత్రికి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా వ్యవహరిస్తున్నారని కొంతమంది అధికారుల తీరుపై మండిపడ్డారు. అంశాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై మంత్రి నారాయణ ఆరా తీశారు. రెరా అధికారులతో నారాయణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి ఏపీ రెరాకు సంబంధించి అనేక వినతులు వచ్చాయని.. 167 దరఖాస్తులు షార్ట్ ఫాల్స్ పంపారని తెలిపారు. పరిష్కారం కావడంలేదని కొన్ని ఫిర్యాదులు వచ్చాయన్నారు.

# ఆ పథకానికి కేరాఫ్ అడ్రస్‌గా కుప్పం



విజయవాడ, జనవరి 6: పీఎం సూర్యఘర్ పథకానికి కుప్పం నియోజకవర్గం కేరాఫ్ అడ్రెస్‌గా నిలువనుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. కుప్పంలో 53,314 విద్యుత్ కనెక్షన్లు త్వరలోనే సౌర విద్యుత్‌తో అనుసంధానం కానున్నాయన్నారు. సుమారు 2,66,15,521 చదరపు అడుగుల్లో సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు రంగం సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఒక నియోజకవర్గంలో భారీ ఎత్తున గృహ విద్యుత్ కనెక్షన్లను సౌర వ్యవస్థతో అనుసంధానించడం ఇదే తొలిసారి అని అన్నారు. పైలట్ ప్రాజెక్టు సీఎం చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గాన్ని ఎంచుకుని ప్రారంభించామన్నారు. పీఎం సూర్యఘర్ (ఇంటిపై) ద్వారా విద్యుత్ వినియోగదారులు విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించుకోవచ్చని చెప్పుకొచ్చారు. పీఎం కుసుమ్ ద్వారా వ్యవసాయ పంపుసెట్లకు సోలార్ విద్యుత్‌ను అనుసంధానం చేయవచ్చన్నారు. అధికంగా ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను డిస్కంలకు అమ్ముకునే సౌలభ్యం కూడా కల్పిస్తున్నామన్నారు. ప్రతీ ఇంటిని ఓ విద్యుదుత్పత్తి కేంద్రంగా మార్చే దిశగా సీఎం చంద్రబాబు ముందడుగు వేస్తున్నారని తెలిపారు. ఈ పైలట్ ప్రాజెక్టుకు కేంద్రం 60 శాతం, ఏపీ ప్రభుత్వం 40 శాతం ఖర్చు చేస్తోందన్నారు. గత ప్రభుత్వం పీఎం సూర్యఘర్‌ను వినియోగించుకోవడంలో పూర్తిగా విఫలం అయ్యిందని విమర్శించారు. పీఎం సూర్యఘర్‌లో తాము చేరడం లేదంటూ జగన్ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిందని గుర్తుచేశారు. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి రంగానికి జగన్ పాలన ఒక గొడ్డలి పెట్టు అని వ్యాఖ్యలు చేశారు. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి రంగానికి చంద్రబాబు నాయుడు పరిపాలన స్వర్ణయుగం అని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు. కాగా.. కుప్పంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈరోజు (సోమవారం) పర్యటించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి సూర్యఘర్ కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. సొంత నియోజకవర్గంలో కుప్పంలో ప్రయోగాత్మకంగా సూర్యఘర్‌ను లాంఛనంగా ప్రారంభించారు సీఎం. కుప్పం నియోజకవర్గంలో విద్యుత్తు కనెక్షన్లు కలిగిన 50వేల గృహాలకు ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ పథకం అమల్లోకి వస్తే విద్యుదుత్పత్తి సంస్థలపై ఆధారపడకుండా స్వయం విద్యుత్ కేంద్రాలుగా ఇంటి పైకప్పును మార్చుకునే కొత్త సౌరవిద్యుదుత్పత్తి విప్లవం అమలులోనికి రానున్నదని అధికారులు చెబుతున్నారు. పీఎం సూర్యఘర్‌లో చేరి కిలో వాట్ నుంచి రెండు కిలోవాట్‌ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యంలో కూడిన ప్యానళ్లను ఏర్పాటు చేస్తే.. రూ.18000 దాకా సబ్సిడీని కేంద్రం ఇస్తుంది. 2 నుంచి 3 కిలోవాట్‌ల ప్యానళ్లకైతే రూ.30వేల దాకా సబ్సిడీ వస్తుంది. ఇక, 3 కిలోవాట్లు దాటితే రూ.78వేల సబ్సిడీ వస్తుంది. పీఎం సూర్యఘర్ పథకాన్ని పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది.




## ముంచిన వైరస్ భయాలు.. 12 లక్షల కోట్లు ఆవిరి!

దలాల్ స్ట్రీట్‌లో మరోసారి వైరస్ గుబులు మొదలైంది. దేశంలో హెచ్ఎంపీవీ కేసులు వెలుగు చూసిన వేళ సూచీలు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. ఆసియా మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు, విదేశీ మదుపర్ల అమ్మకాలు సూచీలను పడేశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1400 పాయింట్ల మేర పతనం అవ్వగా.. నిఫ్టీ 23,550 స్థాయికి చేరింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ దాదాపు రూ.12 లక్షల కోట్ల మేర క్షీణించి రూ.439 లక్షల కోట్లకు చేరింది. ఉదయం సెన్సెక్స్ 79,281.65 (క్రితం ముగింపు 79,223.11) పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. ఉదయం కాసేపు లాభనష్టాల మధ్య చలించింది. బెంగళూరులో ఇద్దరు చిన్నారుల్లో హెచ్ఎంపీవీని గుర్తించినట్లు వార్తలు రావడంతో సూచీల పతనం ప్రారంభమైంది.అనంతరం భారీ నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 77,781.62 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1258.12 పాయింట్ల నష్టంతో 77,964.99 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 388.70 పాయింట్లు నష్టపోయి 23,616.05 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ మరో 3 పైసలు క్షీణించి 85.82గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టైటాన్, సన్‌ఫార్మా షేర్లు మినహా మిగిలిన అన్ని కంపెనీల షేర్లూ నష్టాల్లో ముగిశాయి. టాటా స్టీల్, ఎన్టీపీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 76.30 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2645 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

**కారణాలు ఇవే..** చైనాలో వెలుగుచూసిన హ్యూమన్ మెటానిమో వైరస్ కేసులు భారత్‌లోనూ నమోదుకావడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఉదయం ఫ్లాట్‌గా సూచీలు ప్రారంభం కాగా.. బెంగళూరులో 2, గుజరాత్‌లో ఒక కేసు నమోదైనట్లు వార్తలు రావడం కలకలం రేపింది. ఈ వార్తలు ప్రధానంగా సూచీలను పడేశాయి. ఆసియా మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు కూడా మన మార్కెట్లపై ప్రభావం చూపాయి.

మరికొన్ని రోజుల్లో అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో చైనా సహా మరికొన్ని దేశాలపై టారిఫ్‌ల భయం వెంటాడుతోంది. దీంతో జపాన్ నిక్కీ, హాంకాంగ్, షాంఘై మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్, ఐటీసీ, టాటా స్టీల్ వంటి అధిక వెయిటేజీ ఉన్న స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి సూచీల పతనానికి కారణమయ్యాయి. దేశీయ ఈక్విటీ మార్కెట్లలో ఎఫ్ఐఐల అమ్మకాలు కొనసాగుతుండడం మన మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడికి కారణమని అనలిస్టులు విశ్లేషిస్తున్నారు.




పాక్ సైన్యంపై బలోచ్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ) భారీ ఆత్మాహుతి దాడికి పాల్పడింది. ఈ ఘటనలో నలుగురు సైనికులే మరణించారని ఇస్లామాబాద్ చెబుతుండగా.. బీఎల్ఏ మాత్రం 47 మంది సైనికులను తాము మట్టుబెట్టామని బలోచిస్థాన్ పోస్ట్ ప్రకటించింది. మరో 30 మంది తీవ్రంగా గాయపడినట్లు పేర్కొంది. ఇప్పటికే ఈ దాడికి సంబంధించిన వీడియోలు, చిత్రాలు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారాయి. ఈ దాడిని శనివారం బలోచిస్థాన్‌లోని తుర్బత్ వద్ద నుంచి పాక్ సైనిక కాన్వాయ్.. బీఎల్ఏలోని మాజిద్ బ్రిగేడ్‌కు చెందిన ఆత్మాహుతి దళ యూనిట్ నిర్వహించినట్లు ప్రకటించింది. బీఎల్ఏ ప్రతినిధి జైనాద్ బోలచ్ మాట్లాడుతూ.. బెహ్మన్ ఏరియా తుర్బత్‌కు 8 కిలోమీటర్ల దూరంలో సాయంత్రం 5.45కు ఈ దాడి చేసినట్లు వెల్లడించారు. ఐదు బస్సులు సహా ఏడు సైనిక వాహనాలతో వస్తున్న కాన్వాయ్‌పై దాడి చేసినట్లు జైనాద్ వెల్లడించారు. ఈ వాహనాలు కరాచీ నుంచి తిర్బత్‌లని ఫ్రాంటియర్ కోర్ ప్రధాన కార్యాలయానికి వెళుతున్నాయని చెప్పారు. ఈ వాహనాల్లో సైన్యంలోని వివిధ విభాగాలైన ఎంఐ 309, ఎఫ్‌సీ 117, ఎఫ్‌సీ ఎస్ఐయూ, ఎఫ్‌సీ 326 వింగ్, ఎఫ్‌సీ 81 వింగ్, రిటైర్డ్ ఆర్మీ కెప్టెన్, ప్రస్తుత పోలీస్ అధికారి జోహైబ్ మొహసిన్ ఉన్నారు. ఈ దాడిలో బస్సు పూర్తిగా ధ్వంసమైందని.. ఇతర వాహనాలు కూడా పాక్షికంగా దెబ్బతిన్నట్లు వెల్లడించింది. ఒక సైనిక వాహనం కూడా పూర్తిగా దెబ్బతిన్నట్లు వెల్లడించింది. ఇక తమ ఇంటెలిజెన్స్‌వింగ్ అయిన జిరాబ్ సమన్వయం చేయడంతో దీనిని నిర్వహించినట్లు తెలిపారు. తమ దళానికి చెందిన బహర్‌అలీ ఈ ఆత్మాహుతి దాడి చేసినట్లు ప్రకటించారు. అతడు 2017లో బీఎల్ఏలో చేరగా.. 2022 నుంచి మాజిద్ బ్రిగేడ్ కోసం పని చేస్తున్నట్లు పేర్కొంది. స్థానిక రవాణా చేసే వ్యాపారులు పాక్ సైన్యానికి ఎలాంటి వాహనాలు అందించినా వాటిని దహనం చేస్తామని బీఎల్ఏ ప్రతినిధి హెచ్చరించారు. తాము పాక్ సైన్యం, ప్రభుత్వ ఏజెంట్లకు బలోచిస్థాన్ హైవేలను అసురక్షితంగా మార్చేస్తామన్నారు. మరోవైపు పాక్ రక్షణవర్గాలు దీనికి సంబంధించి తమవద్ద పరిమిత సమాచారం మాత్రమే ఉన్నట్లు పేర్కొన్నారు.

# కాకినాడ సెజ్ కేసు.. ఈడీ విచారణకు హాజరైన వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి



హైదరాబాద్: వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు. బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి ఆయన వచ్చారు. కాకినాడ పోర్టు సెజ్‌కు సంబంధించిన కేసులో ఉదయం 11:30 సమయంలో ఆయన విచారణకు హాజరుకాగా.. ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది. కాకినాడ సెజ్, కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్ షేర్ల బదలాయింపుపై అధికారులు ఆయన్ని ప్రశ్నిస్తున్నారు. షేర్లకు సంబంధించి నగదు బదిలీలపైనా ఆరా తీశారు. గతంలో వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ రెడ్డిని ఈడీ విచారించింది. ఆయన ఇచ్చిన వివరాల ఆధారంగా విజయసాయి రెడ్డిని ప్రశ్నిస్తోంది. సాయంత్రం వరకు విచారణ కొనసాగే అవకాశముంది. వైకాపా హయాంలో కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్ (కేఎస్‌పీఎల్), కాకినాడ సెజ్ (కేసెజ్)ల్లోని రూ.3,600 కోట్ల విలువైన షేర్లను కర్నాటి వెంకటేశ్వరరావు (కేవీ రావు) నుంచి బలవంతంగా లాగేసుకున్న కేసులో ఏపీ సీఐడీ కేసు నమోదు చేసింది. దీని ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలో ఎంపీ విజయసాయిరెడ్డికి గతంలోనే నోటీసులు ఇచ్చి విచారణకు రావాలని సూచించింది. పార్లమెంట్ సమావేశాల కారణంగా ఆయన హాజరుకాలేదు. దీంతో మళ్లీ నోటీసులు ఇవ్వడంతో విజయసాయిరెడ్డి నేడు విచారణకు హాజరయ్యారు.

## గన్నవరం తెదేపా కార్యాలయంపై దాడి కేసు.. 17 మంది ముందస్తు బెయిల్ పిటిషన్లు కొట్టివేత




అమరావతి: గన్నవరం తెదేపా కార్యాలయంపై దాడి కేసులో నిందితుల ముందస్తు బెయిల్ పిటిషన్లను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. తెదేపా కార్యాలయంపై దాడి కేసులో 17 మంది ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. వీరి పిటిషన్లను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. కేసులో ఇప్పటివరకు మొత్తం 89 మందిని నిందితులుగా చేర్చారు. ఇదే కేసులో ఏ71గా వల్లభనేని వంశీమోహన్ ఉన్నారు. వైకాపా హయాంలో గన్నవరం తెదేపా కార్యాలయంపై వల్లభనేని వంశీ అనుచరులు దాడికి పాల్పడ్డారు. తెదేపా కార్యాలయ ఆవరణలోని కారుకు నిప్పంటించారు. కార్యాలయంలోని సామగ్రిని ధ్వంసం చేశారు.

## దేశభక్తి, ప్రజాసేవే ధ్యేయంగా రతన్ టాటా ఎదిగారు: కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ



రతన్ టాటా ప్రపంచ పారిశ్రామిక వేత్తల్లో దేశభక్తి, ప్రజాసేవే ధ్యేయంగా ఎదిగిన వ్యక్తి అని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ ప్రశంసించారు. వ్యాపారం అంటే డబ్బు సంపాదించడమే కాదని చాటిచెప్పిన వ్యక్తి అని కొనియాడారు.అందుకే ఆయన ప్రపంచ కుబేరుల జాబితాలో ఆయన పేరు కనిపించదన్నారు. భారత దేశానికి వ్యతిరేకంగా ఏ దేశం మాట్లాడినా, దేశ ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ దేశానికైనా తన ఉత్పత్తులు ఆపేసిన వ్యక్తి రతన్ టాటా అని తెలిపారు. ఆయన చనిపోయినప్పుడు సాధారణ ప్రజలు కంట తడిపెట్టారని అన్నారు. ఆయన విగ్రహం ఆవిష్కరణకు ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు తీసుకున్న చొరవ అభినందనీయమని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో తనకు భరోసా ఇచ్చిన వ్యక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని ఉద్ఘాటించారు. తాను గెలవాలని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులకు ఖచ్చితంగా చెప్పిన వ్యక్తులు చంద్రబాబు నాయుడు, లోకేష్‌లు అని తెలిపారు. సీఎం చంద్రబాబు రాజకీయంగా గతంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలు మనకు నచ్చకపోవచ్చు అని చెప్పారు. కాని అభివృద్ధి విషయంలో, సమన్వయం విషయంలో ఆయనకు ఎవరూ తక్కువ కాదని స్పష్టం చేశారు. మన మధ్య సమన్వయం దెబ్బతింటే, పార్టీల పరంగా మనకన్నా ప్రజలు ఎక్కువగా నష్టపోతారని అన్నారు. సమన్వయం దెబ్బతింటే మళ్లీ సైకో అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ పేర్కొన్నారు.

# ప్రగ్యా జైశ్వాల్ బ్యాక్ టూ బ్యాక్ కారణం ఆయన కాదంట!

హాట్ బ్యూటీ ప్రగ్యాజైశ్వాల్ పరిచయం అవసరం లేని పేరు. తెలుగులో ఇప్పటికే చాలా సినిమాలు చేసింది. కానీ ఎన్ని సినిమాలు చేసినా నటసింహ బాలకృష్ణ సరసన నటించిన 'అఖండ'తో మాత్రం బాగా ఫేమస్ అయింది. తెలుగులో అమ్మడి క్రేజ్ పెరగడానికి కారణం బాలయ్య ఇమేజ్ అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. అమ్మడి పాపులారిటీ రెట్టింపు అయింది. కానీ ఇతర బ్యానర్లలో అవకాశాలు అందుకోవడంలో మాత్రం వెనుకబడింది. అంతకు ముందు నటించిన కొన్ని తెలుగు సినిమాలు వైఫల్యం చెందడంతో అమ్మడిపై ఐరన్ లెగ్ అనే ముద్ర పడింది. అలా అవకాశాలకు దూరమైంది. మళ్లీ టాలీవుడ్ లో ఛాన్సులు అందుకుంటుందంటే



కారణం బాలయ్య అనే ప్రచారం ఉంది. ప్రస్తుతం బాలకృష్ణ హీరోగా నటించిన 'డాకు మహారాజ్' లోనూ నటించింది. 'అఖండ తాండవం'లో కూడా హీరోయిన్ గా ఎంపికైంది. అయితే బాలయ్య కారణంగా అవకాశాలు వస్తున్నాయనే ప్రశ్న ఆమె ముందుకు వెళ్లడంతో? ఇలా స్పందించింది. బాలయ్య మాత్రం తనకు ఎలాంటి రిఫరెన్స్ లు ఇవ్వలేదని కుండ బద్దలు కొట్టేసింది.

దర్శకుడు బాబి కారణంగానే 'డాకు మహారాజ్' లో ఛాన్స్ వచ్చిందని తెలిపింది. కథలే తన దగ్గరకు వస్తాయి తప్ప తనకు తాను గా వాటి దగ్గరకు వెళ్లనంది. ఇప్పటి వరకూ సాగిన సినిమా ప్రయాణమంతా అలాగే జరిగిందని పేర్కొంది. 'డాకు మహారాజ్' లో తన పాత్రను తెరపై చూసుకునేందుకు ఎంతో ఎగ్జైట్ మెంట్ తో ఎదురు చూస్తున్నానని తెలిపింది. 'కంచె 'సినిమాతో ప్రగ్యా టాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. తొలి సినిమాతోనే నటిగా విమర్శకుల ప్రశంసలు అందుకుంది. అటుపై 'ఓం నమోవెంకటేశాయ', 'గుంటూరోడు', 'నక్షత్రం' సహా మరికొన్ని సినిమాల్లో నటించింది. అవన్నీ పెద్ద ప్రాజెక్ట్ లే. కానీ వాటి ఫలితాలు ప్రగ్యాని రేసులో వెనుకబడేలా చేసాయి. మరి బాలయ్య సినిమాలతోనైనా కెరీర్ స్పీడందుకుంటుందేమో చూడాలి.

## టాలీవుడ్ ను సరిగ్గా వాడుకుంటున్న రెండు ప్రభుత్వాలు!

ఉమ్మడి అంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయినా, తెలుగు చిత్ర పరిశ్రమ మాత్రం హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. భవిష్యత్ లో ఎలా ఉంటుందో తెలియదు కానీ, ఇప్పటికైతే ఇండస్ట్రీ అంతా ఇక్కడే ఉంది. అయినా సరే అటు ఆంధ్రాలో ఇటు తెలంగాణలో రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలతో సినీ ప్రముఖులు సఖ్యతగా ఉండే ప్రయత్నం చేస్తున్నారు. ఏవైనా సమస్యలు వస్తే, ఎవరు అధికారంలో ఉంటే వారితో మాట్లాడుకొని సామరస్యంగా పరిష్కరించుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఇప్పుడు టాలీవుడ్ ఇండస్ట్రీ రెండు గవర్నమెంట్స్ తో కలిసి పని చేస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణా ప్రభుత్వం ఇటీవల కాలంలో మాదక ద్రవ్యాల వినియోగంపై కఠినంగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. డ్రగ్స్ రహిత సమాజమే తమ లక్ష్యం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మరోవైపు



ఆంధ్ర ప్రదేశ్ లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్స్ మీద దృష్టి పెట్టింది. ఫేక్ ప్రచారం, అసహ్యకరమైన పోస్టులు పెడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోడానికి సిద్ధమైంది. ఇలా రెండు తెలుగు రాష్ట్రాలు చేపట్టిన కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి, సెలబ్రిటీలతో ప్రచారం చేయించాలని నిర్ణయించుకున్నారు. కొత్త సినిమాల విడుదలకు ముందే హీరోలు డ్రగ్స్‌పై అవగాహన కల్పించే వీడియోలు చేయాలని రేవంత్ రెడ్డి హితవు పలికిన సంగతి తెలిసిందే. ఇటీవల సినీ ప్రముఖులతో జరిగిన భేటీలోనూ తెలంగాణ సీఎం ఇదే విషయాన్ని ప్రస్తావించారు. సినీ ఇండస్ట్రీ, ప్రభుత్వం కలిసి పని చేయబోతున్నట్లు ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు ప్రకటించారు. ఇప్పటికే ప్రభాస్, ఎన్టీఆర్, అల్లు అర్జున్ వంటి స్టార్ హీరోలు డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో పాల్గొన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసలు కావొద్దని పిలుపునిస్తూ వీడియో సందేశాలు విడుదల చేశారు. వీటికి మంచి రెస్పాన్స్ వచ్చింది. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సోషల్ మీడియాలో ద్వేషపూరితమైన పోస్టులు, నకిలీ వార్తలను అరికట్టేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సినీ ప్రముఖులతో అవగాహనా వీడియోలు చేయిస్తున్నారు. డైరెక్టర్ అనిల్ రావిపూడి, హీరోలు నిఖిల్ సిద్ధార్థ, అడివి శేష్, హీరోయిన్లు శ్రీ లీల, మీనాక్షి చౌదరీ లాంటి పలువురు ఇప్పటికే ఈ ప్రచారంలో పాల్గొన్నారు. ఫేక్ వార్తలు స్ప్రెడ్ చేయొద్దని, సోషల్ మీడియాని దుర్వినియోగపరచవద్దని చెబుతూ వీడియో బైట్స్ రిలీజ్ చేసారు. ఇలా రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు తాము చేపట్టే సామాజిక కార్యక్రమాలపై జనాలకు అవగాహన కల్పించడానికి టాలీవుడ్ ఇండస్ట్రీని ఉపయోగించుకుంటున్నారు. సెలబ్రిటీలు చెబితే ఏవైనా మేసేజ్ లు జనాల్లోకి చాలా త్వరగా, బలంగా వెళ్తాయి కాబట్టి ప్రభుత్వాలు ఈ నిర్ణయం తీసుకున్నాయి.




# 'విశ్వంభర'.. అలాంటి నిర్ణయం తీసుకున్నారా?



మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న లేటెస్ట్ మూవీ "విశ్వంభర". 'బింబిసార' ఫేమ్ మల్లిడి వశిష్ఠ దర్శకత్వంలో భారీ బడ్జెట్ తో ఈ సినిమా రూపొందుతోంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈపాటికి టాలీవుడ్ లో ఈ సినిమా హంగామా కనిపిస్తూ ఉండేది. ఎందుకంటే ముందుగా సంక్రాంతి కానుకగా జనవరి 10వ తారీఖున రిలీజ్ చెయ్యాలని అనుకున్నారు. కానీ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ పెండింగ్ ఉ ఒడటం.. రామ్ చరణ్ నటించిన 'గేమ్ చేంజర్' రేసులోకి రావడంతో చిరు వెనక్కి తగ్గారు. మళ్ళీ ఎప్పుడు విడుదల చేస్తారనేది ఇంకా ప్రకటించలేదు కానీ, దొరికిన ఈ సమయాన్ని మాత్రం బెటర్ విఎఫ్ఎక్స్ కోసం వినియోగించుకుంటున్నారని తెలుస్తోంది. 'విశ్వంభర' అనేది ఒక సోషియో ఫాంటసీ యాక్షన్ అడ్వెంచరస్ థ్రిల్లర్. పంచభూతాలు, త్రిశూల శక్తి అనే అంశాలకు ఆధ్యాత్మికతను జోడించి సరికొత్త కథాంశంతో ఈ సినిమా తీస్తున్నారు. జోనర్ కు తగ్గట్టుగానే ,మూవీలో విజువల్ ఎఫెక్ట్స్ కు అధిక ప్రాధాన్యత ఉంది. అయితే ఇప్పటికే రిలీజైన టీజర్ లో విఎఫ్ఎక్స్ మీద విపరీతమైన ట్రోలింగ్ జరిగింది. అమీర్ పేట్ గ్రాఫిక్స్ కన్నా దారుణంగా ఉన్నాయంటూ నెటిజన్లు సోషల్ మీడియాలో నెగెటివ్ కామెంట్లు చేసారు. చిన్న టీజర్ లోనే ఇలా ఉంటే, మొత్తం సినిమాలో విజువల్స్ ఎలా ఉంటాయో అని ట్రోల్ చేసారు. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ఇప్పుడు క్వాలిటీ విజువల్స్ అందించడం మీద దృష్టి పెట్టారని తెలుస్తోంది. ఇంతకముందు 'విశ్వంభర' సినిమా గ్రాఫిక్స్ కోసం వర్క్ చేసిన టీమ్ ని పక్కన పెట్టి, ఇప్పుడు మరో వీఎఫ్ఎక్స్ స్టూడియోతో పని చేయిస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ఆడియన్స్ కి మంచి ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేలా బెటర్ విజువల్స్ ఇవ్వడానికి కృషి చేస్తున్నారని అంటున్నారు. టీజర్ కు సోషల్ మీడియాలో వచ్చిన నెగిటివ్ రెస్పాన్స్ ని దృష్టిలో పెట్టుకొని, చిరంజీవి సూచనల మేరకే మేకర్స్ ఈ నిర్ణయం తీసుకున్నారని చెబుతున్నారు. దీని కోసం అదనంగా ఇంకొన్ని కోట్లు ఖర్చు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. గతంలో ప్రభాస్ నటించిన 'ఆదిపురుష్' సినిమా విషయంలోనూ ఇదే జరిగింది. టీజర్ రిలీజైన తర్వాత వీఎఫ్ఎక్స్ దారుణంగా ఉన్నాయని, ఇంత టెక్నాలజీ పెట్టుకొని ఇలాంటి నాసిరకమైన గ్రాఫిక్స్ తో వచ్చారని ట్రోల్ చేసారు. ఈ ఫీడ్ బ్యాక్ తో మేకర్స్ రిలీజ్ వాయిదా వేసుకొని మరీ, వీఎఫ్ఎక్స్ మీద రీవర్క్ చేసారు. అయినా సరే లాభం లేకుండా పోయింది. కంటెంట్ నచ్చకపోవడంతో జనాలు ఈ సినిమాని రిజెక్ట్ చేసారు. అయితే ఇప్పుడు "విశ్వంభర" సినిమా రిలీజ్ కు ఇంకా చాలా టైం ఉంది కాబట్టి, బెస్ట్ అవుట్ పుట్ వస్తుందని అభిమానులు భావిస్తున్నారు. 'విశ్వంభర' సినిమాలో చిరంజీవికి జోడీగా త్రిష కృష్ణన్ నటిస్తోంది. ఆషికా రంగనాథ్, సురభి, ఇషా చావ్లా, బాలీవుడ్ నటుడు కునాల్ కపూర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ బ్యానర్ లో విక్రమ్, వంశీ, ప్రమోద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆస్కార్ విన్నర్ ఎంఎం కీరవాణి సంగీతం సమకూరుస్తున్నారు. చోటా కె. నాయుడు సినిమాటోగ్రాఫర్ గా, ఏ.ఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్ గా వర్క్ చేస్తున్నారు. 2025 సమ్మర్ లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.

# సంక్రాంతి సినిమాలకు టికెట్‌పై అదనం ఎంత?




గ్లోబల్‌స్టార్ రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ తెరకెక్కించిన 'గేమ్ ఛేంజర్' పాన్ ఇండియా కేటగిరీలో అత్యంత భారీగా విడుదలకు సిద్ధమైన సంగతి తెలిసిందే. ఈ హై బడ్జెట్ ఎంటర్‌టైనర్ జనవరి 10 న థియేటర్లలో విడుదల కానుంది. భారీ హైప్ నడుమ విడుదలవుతున్న గేమ్ ఛేంజర్ కి టికెట్ రేట్లను పెంచుకునే వెసులుబాటును కల్పిస్తూ తాజాగా ఏపీ ప్రభుత్వం జీవోని జారీ చేసింది. దాని వివరాలు ఇలా ఉన్నాయి. సింగిల్ స్క్రీన్‌లలో రూ. 135 (జిఎస్‌టితో సహా) .. మల్టీప్లెక్స్‌లలో రూ. 175 (జిఎస్‌టితో సహా) మేర 'గేమ్ ఛేంజర్' టిక్కెట్ రేట్ల పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జనవరి 10న 6 షోల వరకు (మధ్యాహ్నం 1 గంటలకు బెనిఫిట్ షోలు సహా) అనుమతిస్తూ జీవో జారీ చేసింది. బెనిఫిట్ షోలు ఒక్కో టిక్కెట్‌పై రూ. 600 (జీఎస్టీ సహా) కి పరిమితం చేసారు. జనవరి 11 నుండి గేమ్ ఛేంజర్ ఆంధ్రప్రదేశ్ అంతటా సింగిల్ స్క్రీన్‌లు , మల్టీప్లెక్స్‌లలో రోజుకు 5 షోలు వేసుకునే వెసులుబాటు కల్పించింది. టిక్కెట్ల ధరల పెంపు, అదనపు ప్రదర్శనలు జనవరి 23 వరకు కొనసాగుతాయి. ప్రభుత్వం కల్పించిన వెసులుబాటు కారణంగా ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద 2 వారాల పాటు భారీగా ఆర్జించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ చిత్రంలో కియరా అద్వాణీ కథానాయిక. దిల్ రాజు నిర్మించారు. గేమ్ ఛేంజర్‌లో ఎస్‌జె సూర్య, అంజలి, శ్రీకాంత్, నవీన్ చంద్ర, సునీల్ కీలక పాత్రలు పోషించారు. ప్రముఖ తమిళ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ స్క్రిప్ట్ అందించగా, శంకర్ తెరకెక్కించారు. ఈ చిత్రానికి తమన్ స్వరకర్త.

**డాకు మహారాజ్ కి టికెట్ పెంపు:** నటసింహం నందమూరి బాలకృష్ణ నటించిన యాక్షన్ డ్రామా 'డాకు మహారాజ్'కు ఆంధ్రప్రదేశ్ సర్కార్ నుండి టికెట్ పెంపు అనుమతులు లభించాయి. సంక్రాంతి పండుగ సీజన్‌లో రెండు వారాల పాటు డాకు మహారాజ్ సినిమా టిక్కెట్ రేట్ల పెంపును ప్రభుత్వం ఆమోదించింది. జీవో ప్రకారం.. జనవరి 12న తెల్లవారుజామున 4 గంటల నుండి ప్రారంభమయ్యే 'డాకు మహారాజ్' బెనిఫిట్ షోల టిక్కెట్ ధరలు రూ. 500 (%+ూ%తో సహా) వరకూ అమ్మొచ్చు. డాకు మహారాజ్ జనవరి 12 నుండి 25 వరకు రోజుకు ఐదు షోల ప్రత్యేక సదుపాయాన్ని కూడా పొందింది. ఈ రెండు వారాల టిక్కెట్ ధరలు మల్టీప్లెక్స్‌లకు రూ. 135 (%+ూ%తో సహా), సింగిల్ స్క్రీన్‌లకు రూ. 110 పెంచారు. బాబీ డియోల్, ప్రగ్యా జైస్వాల్, చాందిని చౌదరి, ఊర్వశి రౌతేలా తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ – ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్‌లపై నాగ వంశీ – సాయి సౌజన్య దీనిని నిర్మించారు. థమన్ సంగీతం అందించారు.

# శ్రీలీల.. అక్కడ బిగ్గెస్ట్ ఎంట్రీ ఇస్తోందిగా!

యంగ్ బ్యూటీ శ్రీలీల.. వరుస సినిమాలతో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. కన్నడ చిత్రంతో తెరంగేట్రం చేసిన అమ్మడు.. పెళ్లి సంద%ణ% సినిమాతో టాలీవుడ్ కు పరిచయమైంది. ఏ ముహూర్తాన తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిందో కానీ.. వెంటనే స్టార్ హీరోల సరసన ఛాన్స్ లు సొంతం చేసుకుని లక్కీ గర్ల్ గా మారిపోయిందనే చెప్పాలి. మాస్ మహారాజా రవితేజ ధమాకా, నటసింహం బాలకృష్ణ భగవంత్ కేసరితో మంచి హిట్స్ అందుకున్న తర్వాత ఆమె నటించిన వరుస సినిమాలు నిరాశపరిచాయి. ఆ తర్వాత చిన్న గ్యాప్ తీసుకున్న అమ్మడు.. ఇప్పుడు మళ్లీ వరుసగా సినిమాలతో బిజీగా మారింది. గత సినిమాల ఫలితం ఎలా ఉన్నా.. శ్రీలీలను తీసుకోవడానికి మేకర్స్ తెగ ఇంట్రెస్ట్ చూపిస్తున్నారని చెప్పాలి. రీసెంట్ గా పుష్ప-2 ది రూల్ మూవీలో అల్లు అర్జున్ సరసన కిస్సిక్ సాంగ్ లో చిందులేసిన శ్రీలీల.. ఓ రేంజ్ లో ప్రశంసలు అందుకుంది. గ్లామర్ స్టెప్పులేసి ప్రేక్షకులను, కుర్రాళ్లను విపరీతంగా ఆకట్టుకుందనే చెప్పాలి. ఇప్పుడు తెలుగులో అక్కినేని బ్రదర్స్ నాగచైతన్య, అఖిల్ సినిమాల్లో నటిస్తున్న ఆమె చేతిలో



పవన్ ఉస్తాద్ భగత్ సింగ్ కూడా ఉంది. దాంతోపాటు హీరో శివ కార్తికేయన్ తో మూవీ చేస్తున్న శ్రీలీల.. త్వరలో కోలీవుడ్ లోకి అడుగుపెట్టనున్న విషయం తెలిసిందే. నేషనల్ అవార్డు విన్నింగ్ డైరెక్టర్ సుధ కొంగర తెరకెక్కిస్తున్న మూవీలో ఆమె నటిస్తున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో శ్రీలీల బాలీవుడ్ ఎంట్రీ గురించి ఎప్పటి నుంచో వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఆ మధ్య రానా టాక్ షోకు వచ్చినప్పుడు బాలీవుడ్ ఎంట్రీ కోసం ఇన్ డైరెక్ట్ గా క్లారిటీ ఇచ్చింది శ్రీలీల. అయితే బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ తో ఆమె బీటౌన్ లోకి ఎంట్రీ ఇవ్వనున్నట్టు ఇప్పుడు జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే వరుస హిట్స్ అందుకుని కార్తీక్ ఆర్యన్ దూసుకుపోతున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఆయన హీరోగా తు మేరీ మై తేరా.. మై తేరా తు మేరీ మూవీ అనౌన్స్మెంట్ వచ్చింది. బాలీవుడ్ బిగ్గెస్ట్ ప్రొడక్షన్స్ కరణ్ జోహార్ ధర్మ ప్రొడక్షన్స్ బ్యానర్ పై సమీర్ విద్వాన్స్ తెరకెక్కిస్తున్నారు. ఆ మూవీలో శ్రీలీల హీరోయిన్ గా యాక్ట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే మేకర్స్ ఆ విషయాన్ని అనౌన్స్ చేయనున్నారని సమాచారం. మొత్తానికి యంగ్ బ్యూటీ.. బిగ్గెస్ట్ ప్రొడక్షన్ హౌస్ తో బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇస్తుందని నెటిజన్లు కామెంట్స్ పెడుతున్నారు.

## సంక్రాంతికి 'రాజాసాబ్' ఏమైనా ఉందా?

ప్రభాస్, మారుతి కాంబోలో రూపొందుతున్న రాజాసాబ్ సినిమాను ఈ ఏడాది సమ్మర్‌లో విడుదల చేయాలని భావిస్తున్నాడు. దర్శకుడు మారుతి అందుకోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఏప్రిల్ నెలలో సినిమాను విడుదల చేయాలని భావించినా కొన్ని కారణాల వల్ల వాయిదా పడే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ సినిమాను చూడటం కోసం ప్రభాస్ ఫ్యాన్స్‌తో పాటు అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పాటలు మినహా టాకీ పార్ట్ దాదాపుగా పూర్తి అయ్యిందని అంటున్నారు. అయితే ఇటీవల చిన్న యాక్సిడెంట్ కారణంగా ప్రభాస్ షూటింగ్స్‌కి హాజరు కాలేక పోతున్నారు. కనుక ఈ సినిమా షూటింగ్ పునః ప్రారంభం కావడానికి మరింత సమయం పడుతుంది. ఈ సమయంలో రాబోతున్న సంక్రాంతి పండుగ కి రాజాసాబ్ సినిమా నుంచి ఏమైనా అప్‌డేట్ వస్తుందా అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తాజాగా దర్శకుడు మారుతి ఒక సినిమా ఈవెంట్‌లో మాట్లాడుతూ ప్రస్తుతానికి గేమ్ ఛేంజర్ సినిమా గురించి ఏం మాట్లాడలేను అన్నాడు. సంక్రాంతికి అప్‌డేట్ వస్తుందా అంటూ ప్రశ్నించిన సమయంలో ఏమీ లేదు, వస్తే మేము తప్పకుండా చెప్తాం అన్నారు. అంటే రాజాసాబ్ సినిమా నుంచి సంక్రాంతి కానుక ఏమీ రావడం లేదు. ఫ్యాన్స్ మాత్రం చిన్న పోస్ట్ విడుదల చేసినా బాగుంటుంది కదా అంటూ కామెంట్స్ చేస్తున్నారు. మారుతి మాత్రం



నిర్మొహమాటంగా సినిమా అప్‌డేట్ ఇప్పుడు లేదు అన్నాడు. చిన్న సినిమాల దర్శకుడిగా పేరున్న మారుతి ఈ సినిమాతో తన స్థాయిని పెంచుకోబోతున్నాడు. థ్రిల్లర్ కాన్సెప్ట్‌తో రూపొందిన ఈ సినిమాను బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ సినిమాగా నిలపడం కోసం మారుతి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. వరుసగా భారీ యాక్షన్ సినిమాలు చేసిన ప్రభాస్ రాజాసాబ్ సినిమాతో కామెడీ హారర్ కాన్సెప్ట్‌తో రాబోతున్నారు. ఈ మధ్య కాలంలో ఆయన నటించిన సినిమాల్లో ఇది చాలా విభిన్నమైన సినిమాగా నిలవబోతోంది అంటూ అంతా చాలా ధీమాతో ఉన్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించే విధంగా ఈ సినిమా ఉంటుంది అంటూ మారుతితో పాటు ఇతర యూనిట్ సభ్యులు చాలా నమ్మకంగా చెబుతున్నారు. ఈ సినిమాలో ప్రభాస్‌కి జోడీగా మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి లు హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ముఖ్యంగా ఈ సినిమాలో ప్రభాస్‌తో పాటు సంజయ్ దత్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. అతి పెద్ద థ్రిల్లర్ కామెడీ సినిమాగా ఈ సినిమా ఉంటుంది అంటూ నిర్మాత చెప్పుకొచ్చారు. 2025 సమ్మర్ కానుకగా రాబోతున్న రాజాసాబ్ సినిమా తర్వాత ఫౌజీ సినిమాను ఇదే ఏడాదిలో ప్రభాస్ ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నాడు. హను రాఘవపూడి దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతుంది. అన్ని వర్గాల వారిని ఆకట్టుకునే విధంగా ఈ సినిమా ఉంటుంది అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు చాలా ధీమాతో ఉన్నారు.







# చర్లపల్లి టెర్మినల్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ

హైదరాబాద్: చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. సాంకేతికత, అత్యాధునిక సౌకర్యాలతో రూ.413 కోట్లతో దీన్ని నిర్మించారు. కార్యక్రమంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా పాల్గొన్నారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ హాజరయ్యారు. గత ఏడాది డిసెంబరు 28న ఈ టెర్మినల్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరిగాయి. అయితే మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణంతో ఆ కార్యక్రమం వాయిదా పడింది. కనెక్టివిటీకి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. మెట్రో నెట్‌వర్క్ 1000 కిలోమీటర్లకు పైగా పరిధి విస్తరించిందని చెప్పారు. జమ్మూ కశ్మీర్, ఒడిశా, తెలంగాణలో కొత్త కనెక్టివిటీకి ఏర్పాట్లు జరిగాయని పేర్కొన్నారు.

**దశాబ్ద కాలంలో రైల్వే కొత్త రూపు సంతరించుకుంది :** "ఒక్కో అడుగు వేసుకుంటూ దేశంలో కొత్త పుంతలు తొక్కిస్తున్నాం. రైల్వే రంగంలో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఆధునికీకరణతో పాటు ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపరుస్తున్నాం. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు కనెక్టివిటీ పెంచేలా కృషి చేస్తున్నాం. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ వంటి హైస్పీడ్ రైళ్లు పరుగులు పెడుతున్నాయి. వీటిలో స్లీపర్ వంటి సౌకర్యాలను కల్పించనున్నాం. కొత్త రైల్వే ట్రాక్‌లతో పాటు అండర్ బ్రిడ్జి నిర్మాణాలు వేగవంతం చేస్తున్నాం. చర్లపల్లి టెర్మినల్ ద్వారా సికింద్రాబాద్, కాచిగూడ స్టేషన్లపై ఒత్తిడి తగ్గుతుంది. దేశవ్యాప్తంగా హైస్పీడ్ రైళ్ల కోసం డిమాండ్ పెరుగుతోంది. దేశంలో 35 శాతం విద్యుదీకరణ పూర్తయింది. వందేభారత్, అమృత్ భారత్, నమో భారత్ రైళ్లు తెచ్చాం. దశాబ్ద కాలంలో రైల్వే కొత్త రూపు సంతరించుకుంది. రైల్వేల ఆధునికీకరణ దేశం ముఖచిత్రాన్నే మారుస్తోంది." అని మోదీ చెప్పారు.

**కేంద్రం సహకరిస్తే తెలంగాణ ట్రిలియన్ ఎకానమీ సాధిస్తుంది: సీఎం రేవంత్‌రెడ్డి...** చర్లపల్లి టెర్మినల్ ప్రారంభించిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రానికి డ్రైపోర్టు ఇవ్వాలని, ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. మెట్రో రైలు విస్తరణకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్రం సహకరిస్తే తెలంగాణ ట్రిలియన్ ఎకానమీ సాధిస్తుందని రేవంత్‌రెడ్డి తెలిపారు.

# కేటీఆర్‌పై కేసు పెడితే రౌడీల్లా ప్రవర్తిస్తున్నారు: మంత్రి పొంగులేటి..



వరంగల్: ఓరుగల్లును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నగరంలో భద్రకాళి ట్యాంక్ బండ్, టెక్స్‌టైల్ పార్క్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించినట్లు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొంగులేటి వెల్లడించారు. వరంగల్ రీజియన్‌కు తెలంగాణ ఆర్టీసీ కేటాయించిన 112 ఎలక్ట్రిక్ బస్సుల్లో ఇవాళ(సోమవారం) 50 బస్సులను మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ ప్రారంభించారు. హనుమకొండ బాలసముద్రం హయగ్రీవాచారి గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి బస్సులను ప్రారంభించారు. మరో 25 బస్సులను సంక్రాంతి లోపు, మిగతా వాటిని ఆ తర్వాత ప్రారంభిస్తామని పొంగులేటి తెలిపారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముగ్గురు మంత్రులూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. "పర్యావరణానికి హాని కలగకుండా తెలంగాణ ఆర్టీసీని అప్డేట్ చేస్తున్నాం. అందుకే ఎలక్ట్రికల్ బస్సులను అందుబాటులోకి తెస్తున్నాం. హైదరాబాద్‌కు ఏ టెక్నాలజీ వచ్చినా వెంటనే దాన్ని వరంగల్‌కూ తెస్తాం. ఉమ్మడి ఏపీలో 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం. 4.5 లక్షల గృహాలను ఇప్పుడు మొదటి విడతలో ఇస్తాం. రాబోయే నాలుగేళ్లలో 20 లక్షల ఇళ్లు కట్టిస్తాం. అన్ని మండలాల్లో మోడల్ ఇందిరమ్మ గృహాలు యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తాం. సంక్రాంతికి ఇందిరమ్మ ఇళ్లు శాంక్షన్ చేస్తాం. ప్రజల వద్దకే ప్రభుత్వాన్ని పంపించాం. 80 లక్షల మంది ఇందిరమ్మ గృహాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వాటిని స్క్రూటినీ చేసి పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా లబ్ధిదారులకు అందిస్తాం. దరఖాస్తు చేసుకోని వారు భయపడాల్సిన పనిలేదు. ఇందిరమ్మ గృహాలు అనేది నిరంతర ప్రక్రియ, అర్హులకు తప్పకుండా ఇస్తాం. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను పూర్తి చేసి అందిస్తాం. రైతు భరోసాపై వేలాది మంది రైతుల అభిప్రాయాలను సేకరించిన తర్వాతే నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఎకరానికి రూ.12 వేలు చొప్పున రైతు భరోసా కింద ఇవ్వాలని నిర్ణయించాం. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇస్తాం. జనవరి 26 నుంచి రైతు భరోసా, రేషన్ కార్డులు అందిస్తాం. భూమిలేని అర్హులైన పేదలకు ఏటా రూ.12వేలు ఇస్తాం. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ ఒకవేళ 200 ఎకరాలు సాగు చేస్తే ఆయనకూ రైతు భరోసా ఇస్తాం. 25 లక్షల మంది అన్నదాతలకు రూ.2 లక్షల రుణమాఫీ చేశాం. సన్న వడ్లు పండించిన రైతన్నలకు రూ.500 బోనస్ ఇచ్చాం. గత ప్రభుత్వం పదేళ్లలో మర్చిపోయిన రేషన్ కార్డులను మేము ఇవ్వబోతున్నాం. ప్రజలు ఇందిరమ్మ రాజ్యంలో ఏం కోరుకున్నారో అవన్నీ నెరవేరుతాయి. పేదోడి సొమ్ము విదేశాలకు పంపించిన అక్రమార్కుడిపై చట్టప్రకారం కేసులు పెడితే ప్రతిపక్షాలు రౌడీల్లా ప్రవర్తిస్తున్నాయి. ప్రతిపక్షాల చిల్లర మాటలకు మా అభివృద్ధి పనులే సమాధానం చెప్తాయని" అన్నారు.

# మోహన్ బాబు కేసు విచారణలో ట్విస్ట్.. ఆ రోజు విచారణ చేస్తామన్న సుప్రీంకోర్టు..

ఢిల్లీ: జర్నలిస్టుపై దాడి కేసులో సినీ నటుడు మోహన్ బాబు ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణను అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఇవాళ(సోమవారం) మోహన్ బాబు బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ సుధాంశు దులియా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ అందుబాటులో లేకపోవడంతో మోహన్ బాబు తరఫు న్యాయవాది ధర్మాసనాన్ని పాస్ ఓవర్ కోరారు. అయితే ఇందుకు న్యాయమూర్తులు అంగీకరించలేదు. దీంతో కేసు విచారణను గురువారానికి వాయిదా వేశారు. కొద్దిసేపటి తర్వాత సుప్రీంకోర్టు వద్దకు ముకుల్ రోహత్గీ చేరుకున్నారు. బెయిల్ పిటిషన్‌పై విచారణ చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి ససేమిరా అన్న ధర్మాసనం.. గురువారానికి కేసు విచారణను వాయిదా వేసినట్లు తెలిపింది.



# న్యాయవాదికి అనుమతి నిరాకరణ.. ఏసీబీ ఆఫీస్ నుంచి వెనుదిరిగిన కేటీఆర్

హైదరాబాద్: ఏసీబీ కార్యాలయం నుంచి మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వెనుదిరిగారు. తన తరఫు న్యాయవాదిని లోనికి అనుమతించకపోవడంతో ఆయన వెళ్లిపోయారు. ఫార్ములా ఈ-రేసు కేసులో ఏసీబీ నోటీసులపై స్పందించారు. రోడ్డుపైనే తన స్పందనను రాతపూర్వకంగా ఏసీబీ అధికారులకు అందజేశారు. హైకోర్టు తీర్పు తర్వాత చట్టప్రకారం ముందుకెళ్లాలని అందులో పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ భవన్‌కు బయలుదేరి వెళ్లారు. అంతకు ముందు కేటీఆర్ ఏసీబీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఫార్ములా ఈ-రేస్ కేసులో ఏసీబీ నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో విచారణ కోసం ఆయన వచ్చారు. ఈక్రమంలో కార్యాలయం వద్ద ఆయన తరఫు న్యాయవాదిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కేటీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తనతో పాటు న్యాయవాది వస్తే నష్టమేంటని ప్రశ్నించారు.



# కాంగ్రెస్, భాజపాలకూ 'గ్రీన్‌కో' ఎన్నికల బాండ్లు: కేటీఆర్



హైదరాబాద్: గ్రీన్‌కో ఎన్నికల బాండ్ల అంశంపై మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. గ్రీన్ కో సంస్థ 2022లో ఎన్నికల బాండ్లు ఇచ్చిందని చెప్పారు. 2023లో ఫార్ములా ఈ-రేసు జరిగిందని పేర్కొన్నారు. కాంగ్రెస్, భాజపాకు కూడా గ్రీన్‌కో బాండ్లు ఇచ్చిందన్నారు. ఫార్ములా ఈ-రేసు కారణంగా గ్రీన్‌కో నష్టపోయిందని వివరించారు. పార్లమెంట్ ఆమోదించిన ఎన్నికల బాండ్లు అవినీతి ఎలా అవుతుందని ప్రశ్నించారు. దేశ వ్యాప్తంగా అన్ని పార్టీలకు వచ్చిన బాండ్లపై చర్చకు సిద్ధమని కేటీఆర్ తెలిపారు. అంతకుముందు ఫార్ములా ఈ-రేసు కేసుకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక విషయాన్ని బయటపెట్టింది. రేసు నిర్వహించిన గ్రీన్‌కో సంస్థ ద్వారా భారాసకు రూ.కోట్ల లబ్ది చేకూరినట్లు వెల్లడించింది. ఆ పార్టీకి ఎన్నికల బాండ్ల ద్వారా రూ.41 కోట్లు వెళ్లినట్లు చెప్పింది. గ్రీన్‌కో, అనుబంధ సంస్థలు 2022 ఏప్రిల్ 8- అక్టోబర్ 10 మధ్య 26 సార్లు బాండ్లు కొన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

# ఆందోళన అవసరం లేదన్న కేంద్రం

చైనాలో హ్యూమన్ మెటానిమోవైరస్ విజృంభిస్తోన్న వార్తలు వస్తోన్న నేపథ్యంలో.. భారత్‌లోనూ ఈ కేసులు వెలుగు చూడటం కలవరపాటుకు గురిచేస్తోంది. దీనిపై స్పష్టతనిచ్చిన కేంద్ర ఆరోగ్య శాఖ.. భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా హెచ్ఎంపీవీ ఇప్పటికే వ్యాప్తిలో ఉందని తెలిపింది. మిగతా శ్వాసకోశ వైరస్‌ల మాదిరిగానే ఉంటుందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొంది. దేశంలో ఇన్‌ఫ్లుయెంజా మాదిరి వ్యాధులు లేదా తీవ్ర శ్వాసకోశ వ్యాధులు అసాధారణ రీతిలో ఏమీ లేవని కేంద్ర ఆరోగ్యశాఖ స్పష్టం చేసింది. "ఇతర శ్వాసకోశ వైరస్‌ల మాదిరిగానే హెచ్ఎంపీవీ ఉంటుంది. సాధారణ జలుబు, ఫ్లూ మాదిరి లక్షణాలు కనిపిస్తాయి. చిన్నారుల్లో, వృద్ధుల్లో ఈ ఇన్‌ఫెక్షన్ ఎక్కువగా కనిపిస్తుంది" అని కేంద్ర ఆరోగ్యసేవల డైరెక్టర్ జనరల్ డాక్టర్ అతుల్ గోయల్ పేర్కొన్నారు. సీజనల్ శ్వాసకోశ సంబంధిత కేసులను ఎదుర్కొనేందుకు అవసరమైన వైద్య సామగ్రి, పడకలు, ఇతర వసతులతో భారత్‌లోని ఆసుపత్రులు సంసిద్ధంగా ఉన్నాయన్నారు. శీతాకాలంలో అవసరమైన జాగ్రత్తలు వహించడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు జన్యు పరివర్తన జరిగిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొనడం మినహాయించి హెచ్ఎంపీవీ వైరస్ గురించి పెద్దగా భయపడాల్సిన అవసరం లేదని ఐసీఎంఆర్ మాజీ శాస్త్రవేత్త డాక్టర్ రామన్ గంగాఖేడ్కర్ ఓ మీడియా సంస్థతో చెప్పారు. ప్రస్తుత రకం వైరస్‌తో ఎటువంటి ఆందోళన అవసరం లేదన్నారు.

**సాధారణ వైరస్..? :** హ్యూమన్ మెటానిమోవైరస్ అనేది ఇదివరకే తెలిసిన వైరస్. ప్రపంచవ్యాప్తంగా పిల్లల్లో సంభవించే శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లలో 12శాతం వరకు ఇదే కారణమవుతోందని అంచనా. రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ (%=ాఎ%)ని పోలి ఉండే ఈ వైరస్.. ఇతర శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల మాదిరిగానే కనిపిస్తుంది. తక్కువ రోగనిరోధక శక్తి కలిగిన వాళ్లలోనే ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. కొన్ని సందర్భాల్లో మాత్రమే ఆసుపత్రిలో చికిత్స అవసరం అవుతుంది. సాధారణంగా 11ఏళ్ల చిన్నారుల్లోనే ఎక్కువగా కనిపిస్తుంది. తొలిసారిగా దీనిని 2001లో నెదర్లాండ్స్‌లో 28 మంది చిన్నారుల్లో గుర్తించారు.




ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు ఘాతుకానికి పాల్పడ్డారు. కుత్రు అటవీ ప్రాంతంలో భద్రతాబలగాలు ప్రయాణిస్తున్న వాహనాన్ని మందుపాతర పెట్టి పేల్చివేశారు. ఈ ఘటనలో 9 మంది జవాన్లు మృతి చెందగా.. పలువురికి గాయాలయ్యాయి. ఐఈడీ పేలిన సమయంలో వ్యాన్‌లో 15 మంది జవాన్లు ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను బీజాపూర్ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. భద్రతా బలగాలు ప్రయాణిస్తున్న వాహనం కుత్రు అటవీప్రాంతంలోని ఓ మార్గం వద్దకు రాగానే.. మావోయిస్టులు మందుపాతరను పేల్చారు. ఈ క్రమంలో రోడ్డుపై భారీ గుంత ఏర్పడింది. పోలీసువాహనం తుక్కుతుక్కైంది. దంతెవాడ, నారాయణ్‌పూర్, బీజాపూర్ సరిహద్దుల్లో పోలీసులతో కలిసి సంయుక్త ఆపరేషన్ నిర్వహించి.. తిరిగి వెళ్తుండగా దారిలో కాపు కాసిన మావోయిస్టులు ఐఈడీని పేల్చారు. గత కొన్నాళ్లుగా ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఏరివేతను భద్రతా బలగాలు ముమ్మరం చేశాయి. శనివారం అర్ధరాత్రి ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందగా.. ఓ కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం భద్రతా దళాలు మావోయిస్టుల కోసం గాలిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

**వారిని వదిలే ప్రసక్తే లేదు..** ఘటనపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి మాట్లాడుతూ జవాన్ల మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నక్సలిజానికి వ్యతిరేకంగా జవాన్లు బలంగా పోరాడుతున్నారని వెల్లడించారు.

ఈ దారుణానికి పాల్పడిన వారిని వదిలే ప్రసక్తే లేదన్నారు. 2026 మార్చి నాటికి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించేలా చర్యలు తీసుకుంటామని హోంమంత్రి అమిత్ షా మాటిచ్చారని గుర్తు చేశారు. త్వరగా ఆయన సంకల్పం నెరవేరాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. మావోయిస్టులు పిరికిపంద చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జవాన్ల త్యాగం వృథా పోదన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజాన్ని పూర్తిగా రూపుమాపుతామన్నారు.

# మోదీ ముందు చిట్టా విప్పిన రేవంత్...

హైదరాబాద్, జనవరి 6: చర్లపల్లి టెర్మినల్ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా వర్చువల్‌గా చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ పాల్గొని ప్రసంగించారు. రైల్వే టెర్మినల్ పూర్తి చేసినందుకు ప్రధానికి తెలంగాణ ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేశారు. బందర్ పోర్ట్‌కు రైల్వే లైన్‌కు అనుమతి ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు. తెలంగాణలో డ్రైపోర్ట్ ఏర్పాటు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తెలంగాణ ఫార్మా ఇండస్ట్రీకి కేరాఫ్ అడ్రస్‌గా ఉందన్నారు. ఎలక్ట్రిక్ వేహికిల్ తయారీకి అనుమతి ఇవ్వాలని కోరారు. రీజనల్ రింగ్ రోడ్డు 374 కిలోమీటర్ల నిర్మాణం జరుగుతోందని.. రీజనల్ రైల్ అవసరం కూడా ఉందన్నారు. రైల్ రింగ్‌కు అనుమతి ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు. వికారాబాద్ నుంచి కొడంగల్ మీదుగా కర్ణాటకకు రైల్వే లైన్ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు. ప్రధాని కోరుకుంటున్న 5 ట్రిలియన్ ఎకానమీ సకారం కావాలంటే అన్ని రాష్ట్రాల అభివృద్ధి జరగాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం కూడా ఇందులో భాగస్వామ్యం కావాలని కోరుకుంటుందన్నారు. డ్రైపోర్ట్ ఏర్పాటు చేస్తే రాష్ట్రాభివృద్ధికి కూడా ఉపయోగకరంగా ఉంటుందని వెల్లడించారు. 1 ట్రిలియన్ ఎకానమి కాంట్రిబ్యూట్ చేసేందుకు తమకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలకు అనుమతి ఇవ్వాలని ప్రధాన మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. కాగా.. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వే స్టేషన్‌లపై ఒత్తిడి తగ్గించి, నగరంలో ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు నాల్గో టెర్మినల్‌గా చర్లపల్లి రూపుదిద్దుకున్న విషయం తెలిసిందే. ఆరున్నరేళ్ల కాల వ్యవధిలో దాదాపు రూ.428 కోట్లతో నిర్మితమైన ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే శివారు ప్రాంతాలకు చెందిన ప్రయాణికులకు మరింత మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుంది. అలాగే జనవరి 7 నుంచి సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్-సికింద్రాబాద్ (12757-12758), గుంటూరు- సికింద్రాబాద్-గుంటూర్ ఎక్స్‌ప్రెస్ (17201-17202), సికింద్రాబాద్- సిర్పూర్ కాగజ్‌నగర్- సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్(17233-17234) రైళ్లకు చర్లపల్లిలో అదనపు స్టాపేజ్ ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. హైదరాబాద్ స్టేషన్ నుంచి చెన్నై సెంట్రల్ వెళ్లి వచ్చే రైళ్లు (12603-12604) మార్చి 7 నుంచి,. గోరఖ్‌పూర్- సికింద్రాబాద్ వెళ్లి వచ్చే రైళ్లు (12589-12590) మార్చి 12 నుంచి చర్లపల్లి టెర్మినల్ నుంచే రాకపోకలు సాగిస్తాయని అధికారులు చెప్పారు.






# హనుమకొండలో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు సర్వీసుల ప్రారంభం

హనుమకొండ: హనుమకొండలో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ జెండా ఊపి సర్వీసులను ప్రారంభించారు. అనంతరం మంత్రులు, ప్రజాప్రతినిధులు బస్సులో కొంత దూరం ప్రయాణించారు. ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు మంత్రులు తెలిపారు.

# పాతబస్తీ మెట్రో భూసేకరణ.. నిర్వాసితులకు చెక్కుల పంపిణీ

హైదరాబాద్: పాతబస్తీ మెట్రో రైలు భూ నిర్వాసితులకు హైదరాబాద్ కలెక్టరేట్‌లో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చెక్కుల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా మెట్రో రైలు ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. రూ.741 కోట్ల వ్యయంతో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మేర మెట్రో లైను నిర్మిస్తున్నట్లు చెప్పారు. నాలుగేళ్లలో మెట్రో నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. మెట్రో నిర్మాణంలో జర్మన్ సాంకేతికత వినియోగిస్తామని చెప్పారు. భూ నిర్వాసితులకు గజానికి రూ. 81వేల పరిహారం చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఇవాళ 40 మందికి చెక్కుల పంపిణీ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మొదటి దశలోనే పూర్తి చేయాల్సి ఉండగా.. ఆస్తుల సేకరణ, అలైన్‌మెంట్ వివాదాలతో పదేళ్లుగా నిలిచిపోయింది.

దీంతో రెండో దశలో చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అవసరమైన రైట్ ఆఫ్ వే కోసం ముందుగా రహదారులు విస్తరించాలి. సర్వే చేపట్టగా 1100 ఆస్తులను సేకరించాల్సి ఉంటుందని అధికారులు తేల్చారు. ఇందుకు సంబంధించి భూసేకరణ నోటిఫికేషన్లు విడతల వారీగా జారీ చేశారు. చదరపు గజానికి రూ.81 వేలుగా పరిహారం ఇవ్వడానికి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ నిర్ణయించారు.



Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com